




TE TL/26/A2635

వాస్తవాలు పలుకు

# DD9 వార్త

తెలుగు దినపత్రిక








హైదరాబాద్ | సంపుటి : 03 | సంచిక:90 | 12-08-2026 బుధవారం | పేజీలు: 08 | వెల 3/-


## రేవంత్ బాగోతం బయటపెడతా



- సీఎం సోదరులంతా పెద్దపెద్ద కంపెనీ ఓనర్లు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపణలు
- కొండల్‌రెడ్డి సంస్థకు భూమి కేటాయింపుపై విమర్శలు
- టెస్సెరాకట్‌లో ఒక్క ఉద్యోగి కూడా లేరని వ్యాఖ్య
- సీఎం కుటుంబంపై వరుస ఆరోపణలు
- మంత్రి శ్రీధర్‌బాబు సమర్థనపై ప్రశ్నలు

**హైదరాబాద్, ఆగస్టు 11:**
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరులంతా పెద్ద పెద్ద కంపెనీలకు యజమానులవుతున్నారని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆరోపించారు. తెలంగాణ భవన్లో ఆయన మీడియాతో మాట్లాడారు. ఒక్క ఉద్యోగి కూడా లేకుండా సీఎం సోదరులు చిన్న చిన్న ఇంటి అడ్రస్లతో పెద్దపెద్ద కంపెనీలు ఏర్పాటు చేసి రిజిస్ట్రేషన్ చేయించారు. అలాంటి ఊరుపేరు లేని కంపెనీలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.200 కోట్ల విలువైన అయిదెకరాల భూమి కేటాయించింది. అనుముల కొండల్రెడ్డి

మిగతా 2వ పేజీలో..

## ఓల్డ్ సిటీ మెట్రో పనుల్లో వేగం పెంచండి

- వీలైనంత త్వరగా టెండర్ ప్రక్రియ ప్రారంభించాలి
- రద్దీకి అనుగుణంగా కొత్త కోచ్‌లు కొనుగోలు చేయాలి
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, ఆగస్టు 11 :**
మెట్రో రైలు రెండో దశలో భాగంగా పాత బస్తీ పనుల్లో వేగం పెంచాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ (హెచ్ ఆర్ఎంఎల్)పై ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పాత బస్తీ మెట్రో పనులపై పలు కీలక సూచనలు చేశారు. ఎంజీబీఎస్

మిగతా 2వ పేజీలో..



### ప్రపంచస్థాయి విద్య.. అదే మా లక్ష్యం

2

## రిజర్వాయర్లు అడుగంటాయ్.. రైతులను ఆదుకోండి

- ఎల్ నినో నేపథ్యంలో ముందస్తు చర్యలు అత్యవసరం
- సాగు, తాగునీటి ప్రణాళిక సిద్ధం చేయాలి
- కలెక్టర్, ఇరిగేషన్ అడ్వైజరీ కమిటీకి హరీశ్ రావు లేఖ

3



## 3.43కోట్ల మందికి స్మార్ట్ ఆహార భద్రత

- 15న స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి శ్రీకారం
- సీఎం కార్యక్రమ ఏర్పాట్లలో లోపం ఉండొద్దు
- పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్

**హైదరాబాద్, ఆగస్టు 11:**
రాష్ట్రంలో ఆహార భద్రతకు ఇక 'స్మార్ట' రూపం రానుంది. రాష్ట్రవ్యాప్తంగా 3.43 కోట్ల మంది లబ్దిదారులకు సంబంధించిన స్మార్ట్ రేషన్

మిగతా 2వ పేజీలో..



## నిషేధిత భూములపై ఆందోళన వద్దు

- చట్టబద్ధంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం
- యుద్ధప్రాతిపదికన దరఖాస్తులను పరిష్కరించాలి
- ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణలో రాజీ లేదు
- ఆన్‌లైన్‌లో ఉన్న వివరాల మేరకే నిర్ణయాలు
- రెవెన్యూ మంత్రి పొంగులేటి

2





### ఉజ్జయిని మహంకాళికి మారు బోనం

- సమర్పించిన దేవాదాయ శాఖ మంత్రి సురేఖ

2

### కొత్త ఉత్సాహాన్నిస్తోన్న నవ భారత యువభేరి

3

## రాష్ట్రంలో రూ.200 కోట్ల సోలార్ స్కామ్

- కేంద్ర మంత్రికి బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు ఫిర్యాదు
- ఒక్కో ఇంటిపై రూ.50 వేల తేడా ఉందని వెల్లడి
- పార్లమెంట్ స్తంభనపై విపక్షాల తీరును తప్పుబట్టిన రఘునందన్‌రావు

3



### పత్తి కొనుగోళ్లలో రైతుకు ఇబ్బందులుండొద్దు

3



## 73 లక్షల ఓట్లు పోయినట్టే

- తెలంగాణలో ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తి
- 3.38 కోట్లకు చేరిన ఓటర్ల సంఖ్య
- 2.64 కోట్ల ఫారాల డిజిటలైజేషన్ పూర్తి
- 45.18 లక్షల మంది శాశ్వత వలస
- 9.22 లక్షల మంది మృతి చెందినట్టు నమోదు
- 11.25 లక్షల మందికి ఆచూకీ లేకుండా..

3

## జీనోమ్ వ్యాలీలో యామైన్

- 200 మంది ప్రతిభావంతులకు ఉద్యోగావకాశాలు
- హర్షం వ్యక్తం చేసిన మంత్రి శ్రీధర్ బాబు

3



**హైదరాబాద్, ఆగస్ట్ 11:**
గ్లోబల్ దిగ్గజ బయోటెక్నాలజి సంస్థ 'యామైన్' జీనోమ్ వ్యాలీలో అత్యాధునిక పరి శోధన, ఆవిష్కరణల కేంద్రాన్ని ఏర్పాటు చేయ డానికి ముందుకొచ్చింది. ఈ మేరకు సచివాలయంలో ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సమక్షంలో ప్రభుత్వంతో మంగళవారం ఎంఓయు చేసుకుంది. అంతకు ముందు శ్రీధర్ బాబుతో బేటీ అయిన యామైన్ ఇండియా ప్రతినిధులు హైదరాబాద్ కేంద్రంగా తమ కార్యకలాపాల విస్తరణపై చర్చించారు.



## గడువులోగా ఉప్పల్ కారిడార్ పూర్తి కావాల్సిందే

- నిర్లక్ష్యాన్ని, పనుల్లో ఆలస్యాన్ని సహించేది లేదు
- ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం చేసి తీరాల్సిందే
- అధికారులూ.. మనసుపెట్టి పనిచేయండి
- ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ పై మంత్రి కోమటిరెడ్డి సమీక్ష

**హైదరాబాద్, ఆగస్టు 11 :**
ప్రభుత్వం విధించిన నిర్ణీత గడువులోగా ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ పనులు పూర్తి కావాల్సిందేనని, నిర్లక్ష్యాన్ని, పనుల్లో ఆలస్యాన్ని అస్సలు సహించేది లేదని రోడ్లు, భవనాలు శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అధికారులను హెచ్చరించారు.

మిగతా 2వ పేజీలో..




# ప్రపంచస్థాయి విద్య.. అదే మా లక్ష్యం

- 'ఎక్స్"లో సీఎం రేవంత్‌రెడ్డి

**హైదరాబాద్, ఆగస్టు 11 :**

భవనాలు నిర్మించడం సులభమే.. కానీ కలలకు పునాదులు వేయాలంటే ప్రభుత్వానికి సంకల్పం ఉండాలి.. ఆ సంకల్పంతోనే తెలంగాణలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ (వైఐఐఆరఎస్) వేగంగా రూపు దిద్దుకుంటున్నాయి అని సీఎం రేవంత్‌రెడ్డి 'ఎక్స్'లో పోస్టు చేశారు. ఆర్థిక, సామాజిక అసమానతలకు ముగింపు పలుకుతూ కులం, మతం, ప్రాంతం, కుటుంబ నేపథ్యం అనే గీతలను చెరిపేస్తూ ప్రతి చిన్నారికి ప్రపంచస్థాయి విద్యను అందించడమే మా ప్రభుత్వ లక్ష్యం. ప్రతి నియోజకవర్గంలో అత్యాధునిక వసతులతో నిర్మితమవుతున్న ఈ విద్యాలయాలు పేద కుటుంబాల పిల్లలను రేపటి శాస్త్రవేత్తలుగా, పరిపాలకులుగా, పారిశ్రామికవేత్తలుగా, నవభారత నిర్మాతలుగా తీర్చిదిద్దే జ్ఞాన మందిరాలుగా నిలవబోతున్నాయి. పేద పిల్లల కలలకు చిరునామాగా, తెలంగాణ మోడల్‌కు ప్రతీకగా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ తరతరాల భవిష్యత్తును మార్చబోతున్నాయి అని పేర్కొన్నారు.

# రేవంత్ బాగోతం బయటపెడతా

**మొదటిపేజీ తరువాయి**

టెసరాక్ కంపెనీ చైర్మన్ అని లింక్ డ్ ఇన్ ప్రొఫైల్లో పెట్టుకున్నారు. మరో సోదరుడు జగదీశ్ రెడ్డి కాంట్రాక్టులు చేసుకుంటున్నారు. సీఎం బామ్మర్ది సృజన్రెడ్డికి సింగరేణిలో కాంట్రాక్టు ఇచ్చారని కేటీఆర్ ఆరోపించారు. సీఎం రేవంత్రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. రేవంత్ షెల్ కంపెనీల బాగోతాన్ని బయటపెడతామని హెచ్చరించారు. రేవంత్ బ్రదర్స్ సూటు బూట్లతో కంపెనీలు ఎలా పెట్టారని ప్రశ్నించారు. టెస్రాక్ట్ కంపెనీలో ఒక్క ఎంప్లాయి కూడా లేరని.. లక్ష రూపాయలతో ఆ కంపెనీ పెట్టడం ఎలా సాధ్యమని నిలదీశారు. ఆ కంపెనీకి వేల కోట్ల భూములు ఎలా కేటా యించారని ప్రశ్నించారు. రూ. 2వేల కోట్ల విలువ చేసే స్థలాన్ని రూ.7 వేల కోట్లకు కేటాయించారని ప్రస్తావించారు. ఆ కంపెనీకి కొండల్రెడ్డికి ఎలాంటి సంబంధం లేదని మంత్రి శ్రీధర్ బాబు ఎలా చెబుతారని నిలదీశారు. శ్రీధర్ బాబుకి తన శాఖలో ఏం జరుగుతుందో తెలియదా.? లేక సీఎం వత్తిడికి తలొగ్గరా అని ప్రశ్నల వర్షం కురిపించారు. కర్ణాటకలో అక్కడి ప్రభుత్వం సీఎం భార్యకు మూడె ఎకరాలు కేటాయించడంపై కేసు నమోదైందని తెలిపారు. ముడా స్కాంలో సిద్ధరామయ్య రాజీనామా చేయాల్సిన పరిస్థితి వచ్చిందని అన్నారు. అనుముల కొండలరెడ్డి టెస్రాక్ట్ సంస్థ కి చైర్మన్గా ఆయనే పేర్కొన్నారు. కొండల్ రెడ్డికి సంబంధం లేకుంటే యూఎస్ కౌన్సిల్ టింగ్ కి ఎలా వెళ్లారని నిలదీశారు. ఈ భూ కేటాయింపులను వదలబోమని వార్నింగ్ ఇచ్చారు. తిరుపతి రెడ్డి ఏ హోదాలో అధికారిక సమావేశాలకు వెళ్తారని ప్రశ్నించారు. ప్రజలకు పట్టాలు ఏ హోదాలో ఇస్తారని నిలదీశారు. రాష్ట్ర గవర్నర్నీ కలిసి ఈ విషయంపై విచారణ జరపాలని కోరతామని అన్నారు. 74 లక్షల వోట్లు తొలగిస్తారనేది ఆందోళనకరమైన విషయమని చెప్పుకొచ్చారు. ముసాయిదా వోటర్ల జాబితా విడుదల తర్వాత పార్టీ నేతలు న్యాయ నిపుణులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. అర్హుల వోట్లు కోల్పోకుండా చూస్తామని అన్నారు. తెలంగాణకు అన్యాయం చేసే జీఆర్ఎంబీ టింగ్కు రాష్ట్ర ప్రభుత్వం వెళ్తుందా లేదా స్పష్టం చేయాలన్నారు. జల సౌదాలో జరిగే జీఆర్ఎంబీ అజెండా మార్చుకుంటే జలసౌధను ముట్టడిస్తామని తెలిపారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టకి జాతీయ హోదా ఇవ్వలేమని కేంద్ర చెప్పినా బీజేపీ, కాంగ్రెస్ ఎంపీలు ఎందుకు నోరు విప్పడం లేదని ప్రశ్నించారు. వరుణ యాగం చేయడం తప్పు కాదు కానీ ప్రభుత్వం చేయాల్సిన పని చేయాలని కేటీఆర్ పేర్కొన్నారు.

# బాధితులకు న్యాయమైన పరిహారం ఇవ్వాలి

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు

**హైదరాబాద్, ఆగస్టు 11 :**




రాజీవ్ రహదారి విస్తరణ ప్రాజెక్టులో భూములు, ఇళ్లు, భవనాలు కోల్పోతున్న బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం న్యాయమైన పరిహారం అందించాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్ రావు డిమాండ్ చేశారు. కార్ఖానాలో బాధితుల ఆందోళనలో ఆయన పాల్గొని వారికి బీజేపీ తరఫున సంఘీభావం తెలిపారు. రోడ్డు విస్తరణ కోసం భూములు, ఇళ్లు, భవనాలు కోల్పోతున్న ప్రజలు అభివృద్ధికి వ్యతిరేకం కాదని స్పష్టం చేశారు. ప్రజా ప్రయోజనం కోసం చేపడుతున్న ఈ ప్రాజెక్టుకు అందరూ సహకరిస్తున్నారని, అయితే తమ ఆస్తులను త్యాగం చేస్తున్న ప్రజలకు సరైన విలువతో కూడిన న్యాయమైన పరిహారం అందాల్సిన అవసరం ఉందని అన్నారు. తూంకుంట ప్రాంతంలో భూముల పరిహారాన్ని పెంచిన విధంగా రాజీవ్ రహదారి విస్తరణలో ఆస్తులు కోల్పోతున్న కార్ఖానా ప్రాంత ప్రజలకు కూడా తగిన మేర పరిహారం పెంచాలని ఆయన కోరారు. తూంకుంటలో పెంచిన పరిహారం కంటే ఈ ప్రాంతం మరింత ఖరీదైన అర్బన్ ప్రాంతమని, అలాంటి పరిస్థితుల్లో ఇక్కడ తక్కువ పరిహారం ఇవ్వడం సమంజసం కాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తూంకుంట మాదిరి ఇక్కడ కూడా సముచితమైన శాతం మేర పరిహారం పెంచి బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. బాధితుల న్యాయమైన డిమాండ్‌కు బీజేపీ పూర్తిగా మద్దతు ఇస్తుందని రామచందర్ రావు స్పష్టం చేశారు.

# ఓల్డ్ సిటీ మెట్రో పనుల్లో వేగం పెంచండి

**మొదటిపేజీ తరువాయి**

నుంచి చాంద్రాయణగుట్ట వరకు 7.5 కి.మీ పొడవునా రోడ్డు విస్తరణ పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు. ఈ కారిడార్‌లో మెట్రో పనులకు సంబంధించి టెండర్ ప్రక్రియను మొదలుపెట్టాలన్నారు. మెట్రో విస్తరణకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న భూ సేకరణ పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని సూచించారు. హైదరాబాద్ మెట్రోకు రోజురోజుకూ రద్దీ పెరుగుతున్న నేపథ్యంలో రద్దీకి అనుగుణంగా అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రయాణికుల రద్దీకి తగినట్టుగా అదనపు బోగీలను జత చేయాలని, ఇందుకు సంబంధించి మెట్రో రైల్ కోచెస్ కొనుగోలుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. మెట్రో ఫేజ్ 2లో భాగంగా ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు 7.5 కి.మీ కారిడార్ కోసం ప్రస్తుత టెక్నాలజీపై ఢిల్లీ



మెట్రోను సంప్రదించి అవసరమైన సలహాలు తీసుకోవాలని అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు.

**డిసెంబర్‌లో ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్**

డిసెంబర్‌లో నిర్వహించతలపెట్టిన ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు సంబంధించి ముందస్తు ఏర్పాట్లపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు పలు సూచనలు చేశారు. సమ్మిట్ నిర్వహణకు ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించి ఏర్పాట్లకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. వ్యాపార రంగంలో వివిధ సెక్టార్లలో గుర్తింపు పొందిన ప్రముఖులను సమ్మిట్‌లో సన్మానించేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ముఖ్యంగా పెట్టుబడులను ఆకర్షించేలా అంతర్జాతీయ ప్రమాణాలతో సమ్మిట్ ఏర్పాట్లు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. గత ఏడాది నిర్వహించిన సమ్మిట్‌లో రాష్ట్రానికి వచ్చిన పెట్టుబడులు, పురోగతికి సంబంధించి పూర్తి వివరాలను నివేదించాలని ఆదేశించారు. పెట్టుబడుల్లో మరింత పురోగతి సాధించేందుకు అవసరమైన ప్రణాళికలను తయారు చేయాలని సూచించారు. సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, స్పెషల్ సీఎస్ జయేష్ రంజన్, ప్రభుత్వ సలహాదారులు రామకృష్ణారావు, ఎన్వీఎస్ రెడ్డి, మెట్రో రైల్ ఎండీ సర్ఫరాజ్ అహ్మద్, అదనపు ఎండీ అజిత్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# 3.43కోట్ల మందికి 'స్మార్ట్' ఆహార భద్రత

**మొదటిపేజీ తరువాయి**

కార్డుల పంపిణీకి స్వాతంత్ర్య దినోత్సవమైన 15వ తేదీన ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టనున్నారు. సంగారెడ్డిలో జరిగే కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఈ ప్రక్రియను లాంఛనంగా ప్రారంభించనుండగా అదే రోజు రాష్ట్రంలోని 33 జిల్లా కేంద్రాల్లో ఏకకాలంలో పంపిణీ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ఏర్పాట్లపై పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, పౌర సరఫరాల సంస్థ డైరెక్టర్ రోహిత్ సింగ్ తదితర ఉన్నతాధికారులతో మంత్రి మంగళవారం సమీక్ష నిర్వహించారు. సంగారెడ్డి కలెక్టర్ ప్రతీక్ జైన్‌తోనూ మాట్లాడి ముఖ్యమంత్రి పర్యటన, బహిరంగ సభ ఏర్పాట్లపై దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలో ప్రస్తుతం 1,06,28,092 ఆహార భద్రత కార్డుల ద్వారా 3.43 కోట్ల మంది లబ్దిదారులు లబ్ది పొందుతున్నారని తెలిపారు. స్మార్ట్ రేషన్ కార్డుల ప్రవేశంతో ప్రజా పంపిణీ వ్యవస్థలో పారదర్శకత, సామర్థ్యం, లబ్దిదారుల సౌలభ్యం మరింత పెరుగుతాయని చెప్పారు.

**ఏడాదిన్నరలో 16.32 లక్షల కొత్త కార్డులు**

2025 జనవరి 26 నుంచి ఇప్పటివరకు 16,32,810 కొత్త ఆహార భద్రత కార్డులను జారీ చేసి వాటి ద్వారా 61,08,544 మంది లబ్దిదారులకు ఆహార భద్రత కల్పించినట్లు మంత్రి వెల్లడించారు. ఆగస్టు 2026 నాటికి రాష్ట్రంలో మొత్తం ఆహార భద్రత కార్డుల సంఖ్య 1.06 కోట్లకు చేరిందన్నారు. ఆహార భద్రత కార్యక్రమం ఏ స్థాయిలో కొనసాగుతోందో ఇందుకు ప్రభుత్వం చేస్తున్న వ్యయమే నిదర్శనమన్నారు. రేషన్ బియ్యం కోసం ఏటా సుమారు రూ.14 వేల కోట్లు, రైతుల నుంచి ధాన్యం కొనుగోలుకు మరో రూ.20 వేల కోట్ల వరకు ప్రభుత్వం వెచ్చిస్తోందని తెలిపారు.

**లబ్ధిదారుడికి ఇబ్బంది కలగొద్దు**

సంగారెడ్డి కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. లబ్దిదారుల తరలింపు, సీటింగ్, భద్రత, కార్డుల పంపిణీతోపాటు ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన ప్రతీ అంశాన్ని ముందుగానే పకడ్బందీగా ప్రణాళిక చేయాలన్నారు. కార్యక్రమానికి సంబంధించిన మినిట్ టు మినిట్ షెడ్యూల్ సిద్ధం చేసి నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలని సూచించారు. వాస్తవ లబ్దిదారులను గుర్తించి ముఖ్యమంత్రి చేతుల మీదుగా స్మార్ట్ రేషన్ కార్డులు అందించాలన్నారు. అనంతరం రాష్ట్రవ్యాప్తంగా కార్డుల పంపిణీలో లబ్దిదారుల గుర్తింపును ధ్రువీకరించి, పూర్తి పారదర్శకతతో కార్డులు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మిగిలిన జిల్లాల్లో నిర్వహించే కార్యక్రమాలకు సంబంధించి కలెక్టర్లకు స్పష్టమైన మార్గదర్శకాలు పంపాలని, అవసరమైన వ్యయంపై ముందుగానే స్పష్టత ఇవ్వాలని పౌర సరఫరాల శాఖ అధికారులకు సూచించారు.

**ప్రతి అర్హుడికీ ఆహార భద్రతే లక్ష్యం**

'రాష్ట్రంలో 1.06 కోట్ల ఆహార భద్రత కార్డుల ద్వారా 3.43 కోట్ల మంది ప్రజలకు ఆహార భద్రత కల్పిస్తున్నాం.. ప్రతి అర్హుడికి నెలకు ఆరు కిలోల సన్న బియ్యాన్ని ఉచితంగా అందిస్తున్నాం.. ఇంత భారీ సంక్షేమ కార్యక్రమాన్ని మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా లబ్దిదారుడి చెంతకు తీసుకెళ్లడమే స్మార్ట్ రేషన్ కార్డుల లక్ష్యం' అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వ ఆహార భద్రత కార్యక్రమం విస్తృతిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని అధికారులను ఆదేశించారు. 1.06 కోట్ల కార్డులు 3.43 కోట్ల లబ్దిదారులు ఉచిత సన్న బియ్యం వంటి కీలక అంశాలతో ప్రింట్, ఎలక్ట్రానిక్, సోషల్ మీడియాతోపాటు షార్ట్ వీడియోలు, రీల్స్ ద్వారా విస్తృత ప్రచారం చేపట్టాలని సూచించారు.



# ఉజ్జయిన మహంకాళికి మారు బోనం

**హైదరాబాద్, ఆగస్టు 11 :**

ఆషాఢ బోనాల ఉత్సవాల్లో భాగంగా అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాU మంత్రి కొండా సురేఖ సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారికి మంగళవారం మారు బోనం సమర్పించారు. ఈ సందర్భంగా దేవాదాయ శాఖ డైరెక్టర్ హనుమంతరావు, అసిస్టెంట్ కమిషనర్ మనోహర్ రెడ్డి, అర్చకులు మంత్రికి డప్పు చప్పుళ్ళు, శివసత్తుల పూనకాల మధ్య ఘనంగా స్వాగతం పలికారు. మంత్రి సురేఖ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రధానార్చకుల ఆధ్వర్యంలో మారు బోనం సమర్పించారు. బోనమెత్తిన మహిళలకు మంత్రి సురేఖ చీర, సారె అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి మారుబోనం కార్యక్రమంలో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. అమ్మవారికి సమర్పించిన బియ్యంతో మారు బోనం చేయడం తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల్లో విశిష్టమైన ఆచారమని పేర్కొన్నారు. అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఆషాఢ బోనాలను భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించుకోవడం మనందరికీ గర్వకారణమన్నారు. ప్రభుత్వ ఏర్పాట్లకు తోడు ప్రజల సహకారంతో ఈ ఏడాది బోనాలు వైభవోపేతంగా జరుగుతున్నాయన్నారు.

# గడువులోగా ఉప్పల్ కారిడార్ పూర్తి కావాల్సిందే

**మొదటిపేజీ తరువాయి**

ఇబ్బందులు లేకుండా సురక్షిత ప్రయాణం అందించేలా చేద్దామని, అందుకనుగుణంగా అధికారులు మనసు పెట్టాలని ప్రత్యేకంగా కోరారు. కార్మికుల సంఖ్య పెంచి మూడు షిఫ్టుల్లో పనులు చేయాలని, రాత్రిళ్లు 11 నుండి ఉదయం 6 గంటల వరకు నిరంతరాయంగా పనులు జరగాలని మంత్రి ఆదేశించారు. కారిడార్ కింద 6.25 కి.మీ బీటీ రోడ్డు పనులు ఈ నెలాఖరుకు పూర్తి చేయాలని తేల్చి చెప్పారు. ప్రతి పది రోజులకో□సారి తాను స్వయంగా క్షేత్రస్థాయిలో పురోగతి సమీక్షిస్తానని, అందుకు తగ్గట్టు రోజువారీ వర్క్ ప్రోగ్రెస్‌ను అధికారులు సమీక్షించాలని ఆదేశించారు. పనులు 60% మేర పూర్తయ్యాయని, మరో 40% పనులు వేగంగా జరుగుతున్నాయని, సైట్‌లో సెగ్మెంట్ తయారీకి నాలుగు బెడ్లు, నాలుగు గ్యాంట్రీస్‌తో 300మంది కార్మికులు రెండు షిఫ్టుల్లో పనిచేస్తున్నారని అధికారులు, వర్క్ ఏజెన్సీ ప్రతినిధులు మంత్రికి వివరించారు. అటు నారపల్లి(సీపీఆర్) వైపు నుండి, ఇటు ఉప్పల్ వైపు నుండి ఇరువైపులా లాంచింగ్ గడ్డర్లతో పనుల్లో వేగం పెంచాలని ఆయన సూచించారు. ఉప్పల్ వైపు నుండి జరుగుతున్న పనుల పురోగతిపై ఆరా తీశారు. ఇప్పటికే ఒక స్లాబ్ పూర్తయిందని, రెండో స్లాబ్ పనులు పురోగతిలో ఉన్నాయని అధికారులు వివరించారు. ప్రస్తుత పరిస్థితుల్లో రాత్రిపూట పనులు, వర్షాల వల్ల నిర్మాణం పూర్తికి మరింత సమయం పట్టే అవకాశం ఉన్నదని నిర్మాణ సంస్థ తెలిపింది. 2026 అక్టోబర్ 31 నాటికి అందుబాటులోకి తెస్తామని ఇప్పటికే డెడ్ లైన్ పెట్టుకున్నాం.. ప్రజల ఇబ్బందుల గురించి ఆలోచించాలంటూ వర్క్ ఏజెన్సీ విజ్ఞప్తిపై మంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు. పనుల్లో మరింత వేగం పెంచాలని, మ్యాన్ పవర్ పెంచి మూడు షిఫ్టుల్లో పనిచేయాలని తెగేసి చెప్పారు. నెలకు ఆరు స్లాబుల చొప్పున పూర్తిచేస్తామని నిర్మాణ సంస్థ మంత్రికి తెలిపింది. దీనికి అను



సంధానంగా జీహెచ్ఎంసీ నిర్మిస్తున్న ఫ్లైఓవర్ పనులపై ఆరా తీసిన మంత్రి ఆ అధికారులతో సమన్వయం చేసుకుంటూ పనులు సమాంతరంగా పూర్తయ్యేలా చూడాలని ఆదేశించారు. దసరాకు ఎట్టి పరిస్థితుల్లో ప్రజలకు అందుబాటులోకి తేవాల్సిందేనని, అధికారులు, వర్క్ ఏజెన్సీ ఆ దిశగా పనిచేయాలని మంత్రి కోమటి రెడ్డి స్పష్టం చేశారు. సమీక్షలో ఆర్అండ్‌బి సీఈ ధర్మారెడ్డి, పలువురు అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

# నిషేధిత భూములపై ఆందోళన వద్దు

**హైదరాబాద్, ఆగస్టు 11 :**

నిషేధిత ఆస్తుల పీవోబీ/22ఎ జాబితాలో ఉన్న భూములకు సంబంధించి ప్రజలు ఎలాంటి అపోహలు పెట్టుకోవాల్సిన అవసరం లేదని, చట్టబద్ధంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తామని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి హామీ ఇచ్చారు. ప్రభుత్వం కొత్తగా ఎలాంటి భూములను నిషేధిత జాబితాలో చేర్చలేదని, గత ప్రభుత్వం నుంచి కొనసాగుతున్న చట్టపరమైన సాంకేతిక చిక్కులను పరిష్కరించి బాధితులకు ఊరట కలిగిస్తామని స్పష్టం చేశారు. సచివాలయంలోని తన కార్యాలయంలో 22ఎ/పీవోబీ అంశంపై హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరి, సంగారెడ్డి కలెక్టర్లు, జిల్లా సబ్‌రిజిస్ట్రార్లతో మంత్రి పొంగులేటి మంగళవారం సుదీర్ఘంగా చర్చించారు. భూముల క్రమబద్ధీకరణకు సంబంధించి ప్రభుత్వం ఇప్పటివరకు జారీ చేసిన జీవోలు, మెమోలు, భూసేకరణ ప్రొసీడింగ్స్, లేఅవుట్ల అనుమతులు తదితర వివరాలతో కూడిన అన్ని డాక్యుమెంట్లను ఈనెల 14లోగా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని అధికారులను ఆదేశించారు. తద్వారా ఫోర్జరీ డాక్యుమెంట్లకు చెక్ పెట్టొచ్చని, రిజిస్ట్రేషన్ సమయంలో సబ్ రిజిస్ట్రార్‌లకు స్పష్టత వస్తుందని, ఏది బోగస్, ఏది నిజమైన డాక్యుమెంట్ అనేదానిపై సూపర్ చెక్ చేసుకోవడానికి వీలుకలుగుతుందని అన్నారు. మరింత పారదర్శకత కోసం పహాణీలు కూడా సబ్ రిజిస్ట్రార్‌కు యాక్సెస్ ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వచ్చిన దరఖాస్తుల్లో ఏది సరైనది ఏది కాదు గుర్తించి సరైన వాటిని యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని కలెక్టర్లకు సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలు, సూచనలకు అనుగుణంగా ప్రజా కోణంలో ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాలన్నారు. ఈ విషయంలో కలెక్టర్లు మరింత క్రియాశీలక పాత్ర పోషించాలన్నారు. 22ఎకు సంబంధించి ప్రజావాణితోపాటు కలెక్టర్లు, ఆర్డీవోలు, తహసీల్దార్లకు, సబ్ రిజిస్ట్రార్లకు జిల్లాల వారీగా వచ్చిన దరఖాస్తులు ఎన్ని, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై కూలంకషంగా చర్చించారు. సమస్య వచ్చినపుడు పరిష్కరించేదానికన్నా సమస్య రాకుండా చూడాల్సిన బాధ్యత కలెక్టర్లపై ఉందన్నారు. పీవోబీ దరఖాస్తులకు సంబంధించి □కేసు వారీగా రోజూ సమీక్షించాలన్నారు. 22ఎ పేరిట ఉద్దేశపూర్వకంగా పేదోడికి, అర్హులకు అన్యాయం జరిగేలా వ్యవహరిస్తే ఊరుకునేదిలేదని హెచ్చరించారు. సబ్ రిజిస్ట్రార్లకు విచక్షణాధికారాలు ఉండకూడదని, అదనపు అధికారాలు వద్దని, ఈ విషయంపై గతంలోనే చాలా స్పష్టత ఇచ్చానని అన్నారు. ఆన్‌లైన్‌లో ఏది ఉంటే దానికి ఆమోదం తెలిపేవరకే వారి అధికారాలను పరిమితం చేయాలని అధికారులను ఆదేశిస్తున్నానన్నారు. ప్రభుత్వ ఆస్తులను కాపాడే విషయంలో ఏమాత్రం రాజీపడే ప్రసక్తేలేదంటూ ఏ చిన్న తప్పు చేసినా క్షమించేదిలేదు.. కఠిన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. ఏదైనా సమస్య ఉంటే జిల్లా సబ్ రిజిస్ట్రార్లు కలెక్టర్ దృష్టికి గాని ఐజీ దృష్టికి గాని తీసుకురావాలన్నారు. పీవోబీ జాబితాలో ఉన్న ఆస్తుల రిజిస్ట్రేషన్‌లను గుడ్డిగా తిరస్కరించకుండా మూడు రోజుల సమయం తీసుకొని ఎందుకు తిరస్కరించవలసి వస్తుందన్న వివరాలను తెలియజేయాలన్నారు. పీవోబీకి సంబంధించి వచ్చిన ప్రతీ దరఖాస్తును ఇకనుండి తహసీల్దార్‌కు కాకుండా నేరుగా కలెక్టర్‌కే పంపాలి.. కలెక్టర్ నుండి డిస్ట్రిక్ట్ రిజిస్ట్రార్, డిస్ట్రిక్ట్ రిజిస్ట్రార్ నుండి కలెక్టర్ మధ్యనే ఉత్తర ప్రత్యుత్తరాలు జరగాలి అని చెప్పారు. గతంలో వ్యవసాయ, వ్యవసాయేతర, పీఓబీ జాబితాలు వేర్వేరుగా ఉండేవి.. వీటిని సమీకృతం చేయడం వల్ల సబ్ రిజిస్ట్రార్ పరిశీలనలో కొన్ని ఆస్తులు నిషేధిత జాబితాలో ఉన్నట్లు కనిపిస్తున్నందున మొత్తం రిజిస్ట్రేషన్ ఆపుతున్నారనే ఫిర్యాదుల వస్తున్నాయన్నారు. తాజాగా అప్‌లోడ్ చేస్తున్న సమాచారంతో సరిపోల్చుకుని నిర్ణయాలు తీసుకోవాలన్నారు. సమావేశంలో రెవెన్యూ సెక్రటరీ డి.ఎస్.లోకేశ్ కుమార్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ఐ.జి రాజీవ్ గాంధీ హనుమంత్, ఆయా జిల్లాల కలెక్టర్లు, జిల్లా రిజిస్ట్రార్లు పాల్గొన్నారు.

DD9 వార్త
తెలుగు దినపత్రిక
DD9 Vaartha
బుధవారం
12-08-2026

# రిజర్వాయర్లు అడుగంటాయ్.. రైతులను ఆదుకోండి

**సిద్దిపేట, ఆగస్టు 11:**

సిద్ధిపేట జిల్లాలోని రిజర్వాయర్లకు తక్షణమే 30 టీఎంసీల నీటిని ఎత్తిపోసి నిల్వ చేయాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు కోరారు. వచ్చే ఏడాది జూలై వరకు జిల్లాలో సాగు, తాగునీటికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఇప్పటి నుంచే కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ఎల్ నినో ప్రభావం నేపథ్యంలో నీటి కొరత తను అధిగమించేందుకు ముందస్తు చర్యలు అత్యవసరమని పేర్కొంటూ కలెక్టర్ కు లేఖ రాశారు. జిల్లా ఇరిగేషన్ అడ్వైజరీ కమిటీ సమావేశం జరగనున్న నేపథ్యంలో హరీశ్రావు రాసిన లేఖలో రిజర్వాయర్లలో నీటి నిల్వలు, రైతుల సాగు పరిస్థితి, తాగునీటి అవసరాలు, భూగర్భజలాల పరిస్థితి, రానున్న యాసంగి పంటకు నీటి లభ్యత తదితర అంశాలను ప్రస్తావించారు.

**రిజర్వాయర్ల పరిస్థితి ఆందోళనకరం**

కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టులో భాగంగా జిల్లాలో అన్నపూర్ణ, రంగనాయకసాగర్, కొమురవెల్లి మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్ రిజర్వాయర్లను నిర్మించుకున్నామని హరీశ్ రావు తెలిపారు. సాధారణంగా ఏటా ఈ సమయానికి మిమ్మానేరు రిజర్వాయర్ నుంచి వీటికి నీటిని ఎత్తిపోసేవారని, ఈసారి ఇప్పటివరకు ఎత్తిపోతలు ప్రారంభించకపోవడం ఆందోళన కలిగిస్తోందన్నారు. అన్నపూర్ణ, రంగనాయకసాగర్ రిజర్వాయర్లు ప్రస్తుతం డెడ్ స్టోరేజీకి చేరుకున్నాయని, మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్ కూడా అడుగంటిన పరిస్థితిలో ఉన్నాయని లేఖలో పేర్కొన్నారు. జిల్లాలోని రిజర్వాయర్లకు తక్షణమే 30 టీఎంసీల నీటిని ఎత్తిపోసి నింపాలని హరీశ్రావు కోరారు. రిజర్వా యర్ల నుంచి చెరువులు, కుంటలు, చెక్ డ్యామ్లను నింపేలా చర్యలు చేపట్టాలని సూచించారు. దీనివల్ల భూగర్భజలాలు పెరిగి ప్రస్తుత వానాకాలం పంటలకు రైతులకు ప్రయోజనం కలుగుతుందని పేర్కొన్నారు.

**65 శాతానికే వానాకాలం సాగు**

ఈసారి గతంలో ఎన్నడూ లేనివిధంగా సుమారు 65 శాతం మంది రైతులే వానాకాలం పంటలు సాగు చేశారని హరీశ్ రావు తెలిపారు. ప్రస్తుతం సాగులో ఉన్న పంటలు గట్టెక్కాలన్నా రిజర్వాయర్లను నింపడం అత్యవసరమని, రైతుల పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని కోరారు. 2027 జూలై వరకు ఎల్నినో ప్రభావం ఉంటుందని ప్రభుత్వం చెబుతున్న నేపథ్యంలో అప్పటివరకు సాగు, తాగునీటికి కొరత రాకుండా ఇప్పటి నుంచే నీటి నిల్వలపై దృష్టి పెట్టాలని లని హరీశ్రావు సూచించారు.ప్రస్తుత అవసరాల కోసం నీటిని వినియోగించిన అనంతరం మళ్లీ ఎత్తిపోసుకునే అవకాశం ఉండేలా మిడ్మానేరు రిజర్వాయర్లో జిల్లాకు సరిపడ నీటిని నిల్వ ఉంచాలని కోరారు. వచ్చే యాసంగి పంట కాలంలో అవసరమైనప్పుడు మిడ్మానేరు నుంచి నీటిని ఎత్తిపోసుకునేలా ముందస్తు ప్రణాళిక రూపొందించాలని హరీశ్రావు కోరారు.

**తాగునీటికి 6 నుంచి 7 టీఎంసీలు అవసరం**

జిల్లాలో తాగునీటి అవసరాలకే సుమారు 6 నుంచి 7 టీఎంసీల నీరు అవసరమవుతుందని హరీశ్రావు తెలిపారు. వరి, పామాయిల్, ఇతర పంటలు సాగు చేసిన రైతులు నీటి ఎత్తిపోతల కోసం ఎదురు చూస్తున్నారని పేర్కొన్నారు. రైతులు నీటిని ఎత్తిపోస్తారని ఆశగా ఎదు రుచూస్తున్న సమయంలో రిజర్వాయర్ల దుస్థితిని చూస్తే బాధగా ఉందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గోదావరిలో నీటి ప్రవాహం ఉన్న సమయంలోనే వడివడిగా నీటిని ఎత్తిపోసి ఉంటే ప్రస్తుతం ఇలాంటి పరిస్థితి వచ్చేది కాదని హరీశ్రావు పేర్కొన్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ జిల్లాలోని వాస్తవ పరిస్థితిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, అవసరమైన నీటిని జిల్లాకు అందుబాటులోకి తీసుకురావా లని విజ్ఞప్తి చేశారు.జిల్లాలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్త కుండా వ్యవసాయ, నీటిపారుదల శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని హరీశ్ రావు సూచించారు. వొచ్చే వేసవిని దృష్టిలో పె ట్టుకుని ఇప్పటి నుంచే రిజర్వాయర్లలో నీటిని నిల్వ చేయడమే తక్షణ ప్రాధాన్యతగా ఉండాలని హరీశ్రావు తన లేఖలో స్పష్టం చేశారు.

# 73 లక్షల ఓట్లు పోయినట్టే

**హైదరాబాద్, ఆగస్టు 11**

తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రక్షాళన కోసం చేపట్టిన ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ఎన్యూమరేషన్ ప్రక్రియ పూర్తయింది. ఈ ప్రక్రియలో రాష్ట్రవ్యాప్తంగా 3.38 కోట్ల మంది ఓటర్లు ఉన్నట్టు ఎన్నికల అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. ఇప్పటివరకు 2.64 కోట్ల ఎన్యూమరేషన్ ఫారాలను డిజిటలైజ్ చేయగా.. నమోదు ప్రక్రియ 78.30 శాతానికి చేరింది. మరోవైపు 73.39 లక్షల ఫారాలు వివిధ కారణాలతో సేకరించలేకపోయినట్టు అధికారులు తేల్చారు.

**73.39 లక్షల ఫారాలు అన్‌కలెక్టబుల్**

రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 73.39 లక్షల ఎన్యూమరేషన్ ఫారాలు అందుబాటులోకి రాలేదు. ఇవి మొత్తం ఓటర్లలో 21.70 శాతంగా ఉన్నాయి. క్షేత్రస్థాయి పరిశీలనలో ఓటర్లు నివాసాలు మార్చడం, మరణించడం, చిరునామాలు లభించకపోవడం, ఇతర ప్రాంతాల్లో ఇప్పటికే ఓటర్లుగా నమోదు కావడం వంటి కారణాలు ప్రధానంగా వెలుగుచూశాయి.

**45.18 లక్షల మంది శాశ్వత వలస**

అన్‌కలెక్టబుల్ ఫారాల్లో అత్యధికంగా 45.18 లక్షల మంది ఓటర్లు తమ పాత నివాస ప్రాంతాల నుంచి శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు తరలిపోయినట్టు గుర్తించారు. వీరి వివరాలు ప్రస్తుత చిరునామాలకు అనుగుణంగా మారే అవకాశం ఉంది. దీంతో తుది జాబితాలో ఓటర్ల సంఖ్య, నియోజకవర్గాల వారీగా నమోదులో గణనీయమైన మార్పులు చోటుచేసుకునే అవకాశం కనిపిస్తోంది.

**9.22 లక్షల మంది మృతి**

ఎన్యూమరేషన్ సందర్భంగా 9.22 లక్షల మంది ఓటర్లు మరణించినట్టు నమోదైంది. వీరి పేర్లు తుది ఓటర్ల జాబితా నుంచి తొలగించే ప్రక్రియ చేపట్టనున్నారు. మరో 11.25 లక్షల మంది ఓటర్లకు సంబంధించి క్షేత్రస్థాయిలో ఆచూకీ లభించలేదని అధికారులు గుర్తించారు.

**ఇప్పటికే మరోచోట నమోదు**

సుమారు 6.70 లక్షల మందికిపైగా ఓటర్లు ఇప్పటికే వేర్వేరు ప్రాంతాల్లో ఓటర్లుగా నమోదై ఉన్నట్టు అధికారులు గుర్తించారు. ఒకటి కంటే ఎక్కువ చోట్ల నమోదైన వివరాలను పరిశీలించి అవసరమైన మార్పులు చేయనున్నారు. ఈ ప్రక్రియ పూర్తయ్యాక తుది ఓటర్ల జాబితా ప్రస్తుత జాబితాతో పోలిస్తే గణనీయంగా మారే అవకాశం ఉంది.

# పత్తి కొనుగోళ్లలో రైతుకు ఇబ్బందులుండొద్దు

- 15-30 రోజుల వ్యవధిలో అన్ని జిల్లాల్లో మిల్లులు ప్రారంభించాలి
- జిల్లా మానిటరింగ్ కమిటీల్లో రైతులను భాగస్వాములను చేయాలి-
- 'కపాస్'లో స్లాట్ బుకింగ్ విధానాన్ని మరింత సరళతరం చేయాలి
- సీసీఐ అధికారులతో సమీక్షలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల

**హైదరాబాద్, ఆగస్టు 11 :**

రాష్ట్రంలో 202627 పత్తి సీజన్‌లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పత్తి కొనుగోళ్లు సజావుగా, పారదర్శకంగా నిర్వహించాలని వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. పత్తి కొనుగోలు ఏర్పాట్లపై సీసీఐ అధికారులతో మంగళవారం ఇక్కడ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కష్టపడి పంట పండించిన రైతులకు మార్కెటింగ్‌లో ఎక్కడా ఇబ్బంది కలగకూడదని, వ్యవస్థలకు చెడ్డ పేరు రాకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. మనం బతకాలంటే రైతు బతకాలి అనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో ముందుకెళ్లి మద్దతు ధర అందేలా చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. పంట కోతకు దాదాపు రెండు నెలల ముందుగానే పత్తి కొనుగోళ్లపై సమీక్ష నిర్వహించడం మంచి పరిణామమన్నారు. సన్న, చిన్నకారు రైతులే అధికంగా ఉన్నందున వారి ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని కొనుగోలు ప్రక్రియను ముందుగానే పకడ్బందీగా సిద్ధం చేయాలని ఆదేశించారు. పత్తి కొనుగోలు ప్రక్రియలో మధ్యవర్తుల జోక్యానికి ఎలాంటి అవకాశం ఇవ్వకూడదని మంత్రి స్పష్టం చేశారు. రైతుల నుంచి నేరుగా, పారదర్శకంగా కొనుగోలు జరిగేలా అధికారులు పర్యవేక్షించాలన్నారు. గత సీజన్లలో పత్తి కొనుగోళ్లలో విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం గుర్తించిన అంశాలను పరిగణనలోకి తీసుకుని ఈ సీజన్‌లో అవి పునరావృతం కాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సీజన్‌లో సుమారు 46.33 లక్షల ఎకరాల్లో పత్తి సాగు జరుగుతుందని, సుమారు 25.85 లక్షల మెట్రిక్ టన్నులు ఉత్పత్తి అయ్యే అవకాశం ఉందని అంచనా వేసినట్టు మంత్రి తెలిపారు. లాంగ్ స్టేపుల్ పత్తికి కేంద్ర ప్రభుత్వం క్వింటాల్‌కు రూ.8,667 కనీస మద్దతు ధర ప్రకటించిందని, గత ఏడాదితో పోలిస్తే రూ.557 పెరిగిందని చెప్పారు. ప్రతి అర్హత కలిగిన రైతుకు ఎంఎస్‌పీ ప్రయోజనం అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని, రైతులు అంతకంటే తక్కువ ధరకు పత్తిని విక్రయించే పరిస్థితి ఎట్టి పరిస్థితుల్లోనూ రావద్దని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని 356 జిన్నింగ్ మిల్లులను నోటిఫై చేసి పత్తి కొనుగోళ్లు సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ముఖ్యంగా ఎల్ 1 నుంచి ఎల్ 12 వరకు అన్ని కేటగిరీల మిల్లులను అవసరానికి అనుగుణంగా ఒకేసారి ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. 15 నుంచి 30 రోజుల వ్యవధిలో అన్ని జిల్లాల్లో మిల్లులు అందుబాటులోకి వస్తే రైతులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. గత సీజన్‌లో 122 సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఉండగా ఈ సీజన్‌లో 131 కేంద్రాలకు పెంచినట్లు మంత్రి తెలిపారు. అన్ని కేంద్రాలు పూర్తిస్థాయిలో పనిచేసేలా ముందస్తు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. మార్కెట్‌కు పత్తి రాక అధికంగా ఉండే ప్రాంతాల్లో అవసరమైన మేరకు అదనపు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఒక ప్రాంతంలో జిన్నింగ్ మిల్లు అందుబాటులో లేకపోతే సంబంధిత గ్రామాలు, మండలాలను సమీపంలోని నోటిఫైడ్ మిల్లుకు అనుసంధానం చేసి రైతులు ఎక్కువ దూరం ప్రయాణించకుండా చూడాలన్నారు. ప్రతి జిల్లాలో కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి మానిటరింగ్ కమిటీలు సమర్థవంతంగా పనిచేయాలని మంత్రి ఆదేశించారు. ఈ కమిటీల్లో రైతుల ప్రతినిధులను కూడా చేర్చుకోవాలని సూచించారు. మార్కెట్ యార్డులు, మిల్లుల వద్ద అవసరమైతే సాయంత్రం 6 గంటల తర్వాత కూడా కొనుగోలు సమయాన్ని స్థానిక కమిటీలు పరిస్థితులకనుగుణంగా పొడిగించాలని సూచించారు.

**'కపాస్' బుకింగ్‌ను సరళతరం చేయాలి**

కపాస్ కిసాన్ యాప్‌లో స్లాట్స్ ఓపెన్ చేసే ముందు జిల్లా కలెక్టర్, జిల్లా మార్కెటింగ్ అధికారులకు సమాచారం అందించి రైతులకు విస్తృతంగా ప్రచారం చేయాలని మంత్రి సూచించారు. స్లాట్ బుకింగ్ విధానాన్ని మరింత సరళీకృతం చేసి ఒక రైతు లేదా మొబైల్ నంబర్‌కు అవసరమైన విధంగా మల్టిపుల్ బార్ కోడ్ సౌకర్యం కల్పించాలన్నారు. పంట బుకింగ్ డేటాను ఎనఐసీ ద్వారా కపాస్ కిసాన్ యాప్‌కు అత్యంత వేగంగా బదిలీ చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రాష్ట్ర సగటు దిగుబడిని ప్రకటించి దానికంటే అధిక దిగుబడి పొందిన రైతులకు ఏఈవోల ద్వారా డిజిటల్ ఈల్డ్ సర్టిఫికెట్స్ వెంటనే జారీ చేయాలని మంత్రి సూచించారు. పత్తి అధికంగా ఉత్పత్తి అయ్యే జిల్లాల్లో అవసరమైన మేరకు కాటన్ టెస్టింగ్ ల్యాబులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అన్ని నోటిఫైడ్ జిన్నింగ్ మిల్లుల్లో స్టేపుల్ లెంగ్త్, మైక్రోనైర్, తేమ శాతం తదితర నాణ్యత ప్రమాణాలను పరీక్షించే పరికరాలు తప్పనిసరిగా అందుబాటులో ఉంచాలని మంత్రి ఆదేశించారు. అన్ని కొనుగోలు కేంద్రాల్లో సీసీటీవీలు తప్పనిసరిగా పనిచేసేలా చూడాలన్నారు. ఎంఎస్‌పీపై పూర్తి అవగాహన కల్పించాలని, రైతు నేస్తం, గ్రామస్థాయి కార్యక్రమాలు, పోస్టర్లు, కరపత్రాల ద్వారా సీసీఐ కొనుగోలు కేంద్రాలు, నాణ్యత ప్రమాణాలు, స్లాట్ బుకింగ్ విధానం తదితర అంశాలపై విస్తృత ప్రచారం నిర్వహించాలని ఆదేశించారు. రైతుల సమస్యలు, ఫిర్యాదుల పరిష్కారానికి ఏర్పాటు చేసిన 1800 599 5779 టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్, 88972 81111 వాట్సాప్ చాట్‌బాట్ సేవలను రైతులు వినియోగించుకునేలా ప్రచారం చేయాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రద్దీ లేదా పెండింగ్ ఏర్పడినప్పుడు వెంటనే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని మంత్రి ఆదేశించారు. రైతుకు ఎంఎస్‌పీ అందించడమే ప్రధాన లక్ష్యమని, ఈ విషయంలో ఏ స్థాయిలో నిర్లక్ష్యం లేదా నిబంధనల ఉల్లంఘన జరిగినా తీవ్రంగా పరిగణిస్తామని మంత్రి హెచ్చరించారు.

# రాష్ట్రంలో రూ.200 కోట్ల సోలార్ స్కామ్

**హైదరాబాద్, ఆగస్టు 11**

తెలంగాణలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రూ.200 కోట్ల సోలార్ స్కామ్‌కు పాల్పడిందని బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు ఆరోపించారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించాలని కోరుతూ కేంద్ర పునరుత్పాదక ఇంధన వనరుల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషికి ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. ఉచిత విద్యుత్ పేరుతో కేంద్రం అందిస్తున్న సబ్సిడీ నిధులను రాష్ట్ర ప్రభుత్వం పక్కదారి పట్టిస్తోందని ఆయన ఆరోపించారు.

**40 వేల ఇళ్లకు ప్యానెళ్లు**

'హర్ ఘర్ బిజిలీ ముక్త్ యోజన' కింద రాష్ట్రంలో 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ వినియోగించే 40 వేల ఇళ్లను గుర్తించి సోలార్ ప్యానెళ్లు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం టెండర్లు పిలిచిందని రఘునందన్‌రావు తెలిపారు. ఒక్కో ఇంటిపై 2 కిలోవాట్ల సోలార్ ప్యానెల్ ఏర్పాటు కోసం ఓ సంస్థకు రూ.1,36,000 చొప్పున కాంట్రాక్టు ఇచ్చారని చెప్పారు.

**సబ్‌కాంట్రాక్టుతో రూ.50 వేల తేడా**

కాంట్రాక్టు పొందిన సంస్థ అదే పనిని మరో సంస్థకు రూ.86,000కే సబ్‌కాంట్రాక్టు ఇచ్చిందని రఘునందన్‌రావు పేర్కొన్నారు. దీంతో ఒక్కో ఇంటిపై రూ.50 వేల వ్యత్యాసం ఏర్పడుతోందని తెలిపారు. 40 వేల ఇళ్లకు ఇదే విధానం వర్తిస్తే రూ.200 కోట్ల మేర అవినీతికి అవకాశం ఏర్పడిందని ఆరోపించారు.

**కేంద్ర సబ్సిడీపై ప్రశ్నలు**

సోలార్ విద్యుత్ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం 1 కిలోవాట్‌కు రూ.30 వేలు, 2 కిలోవాట్లకు రూ.60 వేల చొప్పున సబ్సిడీ అందిస్తోందని రఘునందన్‌రావు తెలిపారు. అయినప్పటికీ మోదీ ప్రభుత్వం ఎలాంటి సాయం చేయడం లేదంటూ కాంగ్రెస్ ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ ఆరోపణలపై స్పష్టత ఇవ్వడంతోపాటు వెంటనే విచారణకు ఆదేశించాలని కోరారు. లేని పక్షంలో కేంద్రం నుంచి వచ్చే నిధులు నిలిచిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

**పార్లమెంట్ స్తంభనపై విమర్శలు**

పార్లమెంట్ సమావేశాలు సజావుగా సాగకపోవడంపైనా రఘునందన్‌రావు స్పందించారు. సభను నడిపించడంలో అధికార పక్షంతోపాటు ప్రతిపక్షాలకు సమాన బాధ్యత ఉందన్నారు. ఢిల్లీ విద్యార్థుల ఆందోళనపై చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నప్పటికీ ప్రతిపక్షాలు సరైన అంశం లేక రోజూ సభలో ఆందోళన చేస్తున్నాయని విమర్శించారు. కేంద్ర హోంశాఖ మంత్రి కూడా దీనిపై సమాధానం ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. విపక్షాల నిరసనల కారణంగా ఇతర ఎంపీలు ప్రజా సమస్యలను సభలో ప్రస్తావించే అవకాశం కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.



# జీనోమ్ వ్యాలీలో యామైన్

సమావేశానంతరం యామైన్ ఇండియా ఎండీ నవీన్ గుళ్లపల్లి, తెలంగాణా ప్రభుత్వ పరిశ్ర మల ప్రత్యేక కార్యదర్శి కృష్ణ ఆదిత్య లు ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. జెనోమ్ వ్యాలీలో ఏర్పాటు చేస్తున్న ఈ పరిశోధన కేంద్రంలో 200 మంది ప్రతిభావంతులకు ఉద్యోగావకా శాలు లభిస్తాయని శ్రీధర్ బాబు ఈ సందర్భం గా వెల్లడించారు. యామెన్ ఇటీవల 3 వేల మంది ఉద్యోగులతో అతి పెద్ద జిసిసి ని ఏర్పాటు చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేసారు. ఔషధ రంగ దిగ్గజ కంపెనీలు తెలంగాణ పట్ల అపార విశ్వాసం కనబర్చడం తమ ప్రభుత్వా నికి దక్కిన గౌరవమని అన్నారు. లైఫ్ సైన్సెస్ కంపెనీలకు రాష్ట్రం ఒక ముఖ్యమైన వేదికగా మారడం పట్ల శ్రీధర్ బాబు సంతోషం వ్యక్తం చేసారు. దాదాపు 100 దేశాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తున్న యామైన్ క్యాన్సర్, గుండె సంబంధిత వ్యాధులు, ఎముకల ఆరోగ్యం, ఇన్ఫ్లమేషన్, శ్వాసకోశ వ్యాధులు, అరుదైన వ్యాధులు తదితర తీవ్రమైన అనారోగ్య సమస్యలకు వినూత్న చికిత్సలను అభివృద్ధి చేస్తోంది. కార్యక్రమంలో పరిశ్రమల ప్రత్యేక కార్యదర్శి కృష్ణ ఆదిత్య, తెలంగాణా లైఫ్ సైన్సెస్ సిఇఓ సర్వేశ్ సింగ్, యామైన్ ఇండియా ఎండీ నవీన్ గుళ్లపల్లి, ఇడి శ్రీను కొసరాజు, అనుమిత పాల్గొన్నారు.

# కొత్త ఉత్సాహాన్నిస్తోన్న నవ భారత యువభేరి

**హైదరాబాద్, ఆగస్టు 11 :**

దేశ గతిని మలుపు తిప్పి దేశ రాజకీయాల్లో సరికొత్త శకానికి బీజం వేసిన చారిత్రక ఘట్టానికి 13 ఏళ్లు.. బీజేపీ జాతీయ ప్రచార కమిటీ చైర్మన్‌గా, ప్రధానమంత్రి అభ్యర్థిగా ఎంపికైన తర్వాత నరేంద్ర మోదీ హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో 'నవభారత యువభేరి' వేదికగా సరిగ్గా ఇదేరోజు(11 ఆగస్టు, 2013 నాడు) ఎన్నికల శంఖారావాన్ని ప్రారంభించిన దృశ్యాలు ఇవాల్టికీ కొత్త ఉత్సాహాన్ని అందిస్తాయి అని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి ఫేస్‌బుక్‌లో నాటి అనుభవాన్ని పోస్టు చేశారు. పబ్లిక్ మీటింగ్స్ చరిత్రలోనే తొలిసారిగా డెలిగేషన్ ఫీజును చెల్లించి మరీ లక్షలాదిమంది ఎల్‌బీ స్టేడియానికి తరలి వచ్చి నరేంద్రమోదీకి తమ సంపూర్ణమైన మద్దతును తెలియజేశారన్నారు. నాడు మన హైదరాబాద్ వేదికగా పడిన నరేంద్రమోదీ తొలి అడుగు తర్వాత దేశ రాజకీయాల్లో బీజేపీ సంచలన విజయాలతో దినదిన ప్రవర్ధమానమైందని, వారి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఇవాళ 'వికసిత భారత్ సంకల్పం2047' లక్ష్యాలతో దేశాన్ని అభివృద్ధి పథంలో ముందుకు నడుపుతోందని తెలిపారు. ఈ చారిత్రకమైన సందర్భంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న తాను 13 ఏళ్ల నాటి ఆ అద్భుతమైన సందర్భాన్ని గుర్తు చేసుకుంటున్నానన్నారు.

# చార్మినార్ వద్ద నకిలీ రాపిడో డ్రైవర్ హల్‌చల్

- అప్రమత్తతతో మోసాన్ని గుర్తించిన యువతి
- నంబర్ ప్లేట్, డ్రైవర్ ఐడీ లేకపోవడంతో అనుమానం
- అక్కడికక్కడే రాపిడో యాప్ డౌన్‌లోడ్ చేసిన వ్యక్తి
- వీడియో ద్వారా ప్రయాణికులను అప్రమత్తం చేసిన యువతి
- భద్రతా వివరాలు తనిఖీ చేసుకోవాలని రాపిడో సూచన

**హైదరాబాద్, ఆగస్టు 11**

చార్మినార్ సమీపంలో రాత్రివేళ ఓ యువతిని రాపిడో డ్రైవర్ పేరుతో ఓ వ్యక్తి నమ్మించే ప్రయత్నం చేశాడు. అయితే వాహనానికి నంబర్ ప్లేట్ లేకపోవడం, డ్రైవర్ గుర్తింపు కార్డు చూపించకపోవడంతో ఆమె అనుమానించింది. సమయస్ఫూర్తితో వ్యవహరించి అతడి అసలు వ్యవహారాన్ని గుర్తించి అక్కడి నుంచి వెళ్లిపోవాలని హెచ్చరించింది. ఈ ఘటన ప్రయాణికుల భద్రతపై మరోసారి ఆందోళనకు దారితీసింది.

**ఐడీ అడగడంతో అసలు విషయం..**

కంటెంట్ క్రియేటర్ సిద్ధేశ్వరి సుగంత్ రాత్రి 9 గంటల సమయంలో చార్మినార్ వద్ద ఆటో కోసం ఎదురుచూస్తుండగా స్కూటర్‌పై వచ్చిన వ్యక్తి రాపిడో కావాలా అని అడిగాడు. అయితే అతడి వాహనానికి నంబర్ ప్లేట్ లేకపోవడాన్ని ఆమె గమనించింది. డ్రైవర్ ఐడీ కార్డు చూపించాలని కోరగా అతడు తడబడినట్టు ఆమె తెలిపింది.

**అక్కడే యాప్ డౌన్‌లోడ్..**

అనుమానం వ్యక్తం చేయడంతో ఆ వ్యక్తి తన ఫోన్‌లో ప్లే స్టోర్ తెరిచి రాపిడో యాప్‌ను డౌన్‌లోడ్ చేయడం ప్రారంభించాడు. వాహనం స్టార్ట్ కావడం లేదంటూ విషయాన్ని దాటవేసే ప్రయత్నం చేశాడు. ఫోన్‌ను పరిశీలించగా యాప్ అప్పుడే లాగిన్ అవుతూ ఓటీపీ పేజీలో ఉన్నట్టు గుర్తించింది. దీంతో అతడు నిజమైన రాపిడో డ్రైవర్ కాదని సిద్ధేశ్వరి నిర్ధారించుకుంది.

**గట్టిగా హెచ్చరించిన యువతి**

బుకింగ్ లేకుండా తనను బైక్‌పై రావాలని కోరడంపై ఆగ్రహం వ్యక్తం చేసిన సిద్ధేశ్వరి.. మర్యాదగా అక్కడి నుంచి వెళ్లిపోవాలని అతడిని హెచ్చరించింది. ఈ ఘటనకు సంబంధించిన వీడియోను సోషల్ మీడియాలో పంచుకున్న ఆమె.. ఎలాంటి బుకింగ్, ధ్రువీకరణ లేకుండా ఓ వ్యక్తి ఇలా ప్రయాణికురాలిని ఎక్కించుకునేందుకు ప్రయత్నించడం తనను దిగ్భ్రాంతికి గురిచేసిందని పేర్కొంది.

**ప్రయాణికులకు రాపిడో సూచనలు**

ఈ ఘటనపై స్పందించిన రాపిడో సంస్థ.. సిద్ధేశ్వరి అప్రమత్తతను అభినందించింది. యాప్‌లో రైడ్ బుక్ చేయకుండా నేరుగా వచ్చి తాము డ్రైవర్లమని చెప్పే వ్యక్తులను నమ్మవద్దని వినియోగదారులను హెచ్చరించింది. ప్రయాణం ప్రారంభించే ముందు యాప్‌లో కనిపించే డ్రైవర్ గుర్తింపు, వాహన నంబర్, ఓటీపీ వివరాలను తప్పనిసరిగా సరిపోల్చుకోవాలని సూచించింది.



# సీఎంఆర్ఎఫ్ తో పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా

## పినపాక నియోజకవర్గ లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు.



**మణుగూరు.ఆగస్టు 11(డి డి 9వార్త)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, పినపాక నియోజకవర్గంలోని లబ్ధిదారులకు రూ.4 లక్షల 15 వేల రూపాయల విలువ గల ముఖ్యమంత్రి సహాయనిధి (CMRF) చెక్కులను పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అందజేశారు.ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాయం మాట్లాడుతూ.. ఆపదలో ఉన్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో భరోసాగా నిలుస్తుందని అన్నారు. అనారోగ్యంతో చికిత్స పొందుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ ద్వారా అందుతున్న ఆర్థిక సహాయం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు.ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు, ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న కుటుంబాలకు ప్రభుత్వ పరంగా అవసరమైన సహాయం అందేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల మరియు పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, జిల్లా ముఖ్య నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, మండల ముఖ్య నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు మరియు వారి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# మదన పోచమ్మ ఆలయ స్లాబ్ నిర్మాణానికి శ్రీకారం

## కొబ్బరికాయ కొట్టి ప్రారంభించిన మనాలి రాజ్ ఠాకూర్



**పెద్దపల్లి బ్యూరో, ఆగస్టు 11 (డీడీ9 వార్త):**

రామగుండం ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ ఆదేశాల మేరకు, ఆయన సతీమణి, మక్కాన్ సింగ్ సేవా సమితి చైర్మన్ శ్రీమతి మనాలి రాజ్ ఠాకూర్ మంగళవారం మార్కండేయ కాలనీలోని రాజేష్ థియేటర్ సమీపంలో ఉన్న శ్రీ మదన పోచమ్మ అమ్మవారి ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో చేపడుతున్న ఆలయ పైకప్పు నిర్మాణ పనులను కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించారు. అనంతరం మనాలి రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ..... ఆలయ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. మక్కాన్ సింగ్ సేవా సమితి ద్వారా అవసరమైన సహకారం అందించి ఆలయ నిర్మాణం పూర్తయ్యేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అమ్మవారి ఆశీస్సులు నియోజకవర్గ ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో స్థానిక ట్రాఫిక్ సీఐ రాజేశ్వరరావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి, డిప్యూటీ మేయర్ పాతిపల్లి ఎల్లయ్య, కార్పొరేటర్ సాగి సంతోష్‌రావు, ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక మహిళలు, భక్తులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఎల్బీనగర్ లో 'ఆకాశరామన్న' ఫ్లెక్స్ .. లబ్దిదారులు ఎవరు!!!

- ఆరుగురు లబ్ధిదారులంటూ ప్రకటనలు.. పేర్లు ప్రకటించలేని దుస్థితి ఎందుకు!!
- సీపీఐ ఫ్లోర్ లీడర్ మార్కపురి సూర్య

**పెద్దపల్లి బ్యూరో, ఆగస్టు 11 (డీడీ9 వార్త):**




రామగుండం కార్పొరేషన్ పరిధిలోని ఎల్బీనగర్‌లో లబ్ధిదారుల పేర్లు వెల్లడించకుండా ఏర్పాటు చేసిన ఫ్లెక్స్‌పై సీపీఐ ఫ్లోర్ లీడర్, 41వ డివిజన్ కార్పొరేటర్ మార్కపురి సూర్య ప్రశ్నలు సంధించారు. అసలు లబ్ధిదారులు ఎవరో ప్రజలకు స్పష్టంగా తెలియజేయాలని డిమాండ్ చేశారు. ఎల్బీనగర్‌లో అసలైన లబ్ధిదారులం అంటూ ఏర్పాటు చేసిన ఫ్లెక్స్‌లో లబ్ధిదారుల పేర్లు ఎందుకు వెల్లడించలేదని ప్రశ్నించారు. ఆరుగురు లబ్ధిదారులు ఉన్నారని నిన్నటి వరకు ప్రకటనలు చేసినప్పటికీ, నేడు కనీసం వారి పేర్లను కూడా ప్రకటించలేకపోవడం ప్రజాప్రతినిధి వైఫల్యానికి నిదర్శనమని విమర్శించారు. అసలైన లబ్ధిదారులెవరో వెంటనే బహిరంగంగా ప్రకటించాలని రామగుండం ఎమ్మెల్యేను మార్కపురి సూర్య డిమాండ్ చేశారు. లబ్ధిదారుల పేర్లు వెల్లడించలేని పరిస్థితి ఉంటే, ఎమ్మెల్యే గతంలో చేసిన డిమాండ్ మేరకు సీపీఐ ప్రకటించిన బాధితులందరికీ న్యాయం చేయాలని కోరారు. అసలైన లబ్ధిదారుల పేర్లు వెంటనే ప్రకటించాలి.. లేకపోతే బాధితులందరికీ న్యాయం చేయాలి అని మార్కపురి సూర్య డిమాండ్ చేశారు.

# గండుగులపల్లి EMRS లో "ఎమ్మెల్యే విద్యాయాత్ర





- మన ఎమ్మెల్యే మన బడి" ప్రారంభంనికి శ్రీకారం-ఎమ్మెల్యే జారే. ఆదినారాయణ...

**అశ్వరావుపేట:ఆగస్టు11(డిడి 9వార్త)**

గండుగులపల్లిలోని తెలంగాణ ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలను (EMRS) అశ్వారావుపేట శాసనసభ్యులు జారే ఆదినారాయణ సందర్శించారు. ఈ సందర్భంగా 'నేను సైతం చేయూత విద్యా అభివృద్ధి' కార్యక్రమంలో భాగంగా MLA విద్యాయాత్ర – మన MLA మన బడి అనే నూతన కార్యక్రమానికి ఆయన శ్రీకారం చుట్టారు. పాఠశాలలో పోలీస్ మరియు అధికారులు ఆధ్వర్యంలో నిర్వహించిన డ్రగ్స్ వ్యతిరేక వారోత్సవాల అవగాహన కార్యక్రమంలో ఎమ్మెల్యే గారు పాల్గొని మాట్లాడారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో విద్యార్థుల పాత్ర అత్యంత కీలమని, డ్రగ్స్ రహిత అశ్వారావుపేట నిర్మాణానికి ప్రతీ విద్యార్థి భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. ఒక్కసారి మత్తు పదార్థాలకు బానిసైతే జీవితం చీకటిమయం అవుతుందని హెచ్చరిస్తూ, చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ మంచి లక్ష్యాలు, చదువు,క్రీడలు, సృజనాత్మక కార్యక్రమాలపై దృష్టి పెట్టాలని సూచించారు. విద్యార్థుల్లో చైతన్యం పెంపొందించేందుకు వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. అనంతరం ఉపాధ్యాయులు బోధిస్తున్న విధానాన్ని, విద్యా ప్రమాణాలను పరిశీలించిన ఎమ్మెల్యే గారు తరగతి గదులు, హాస్టల్, తాగునీరు మరియు ఇతర మౌలిక వసతులను తనిఖీ చేశారు. విద్యార్థులకు నిరంతరం నాణ్యమైన విద్య, సౌకర్యాలు అందేలా చూడాలని అధికారులకు, ఉపాధ్యాయులకు ఆదేశించారు.అనంతరం విద్యార్థులతో కలిసి ఆత్మీయంగా టిఫిన్ చేస్తూ వారి సమస్యలు, చదువు విశేషాలను అడిగి తెలుసుకున్నారు. నియోజకవర్గంలో విద్యా వ్యవస్థను బలోపేతం చేయడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ఇదప్ప గారు,దమ్మపేట మండలం ట్రైనింగ్ కలెక్టరు M మురళి ,ఎంపీడీఓ రవీంద్ర రెడ్డి ,ఎంఈఓ జగపతి రావు,సిఐ నాగరాజు ,Si రాజేష్ గారు,మాజీ సర్పంచ్ మడకం రాజేష్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కాక రమేష్ ,స్థానిక PH డాక్టర్ , అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు...

# విద్యార్థులు క్రమశిక్షణతో చదవాలి

- బాధ్యతాయుత పౌరులుగా ఎదగాలి..
- సామాజిక అవగాహన పెంపొందించుకోవాలి..
- జెడ్పి హైస్కూలు ప్రార్ధన గీతంలో పాల్గొన్నఎమ్మెల్యే పాయం.

**మణుగూరు.ఆగస్టు 11(డి డి 9వార్త)**

విద్యార్థులు క్రమశిక్షణతో చదవాలని,బాధ్యతాయుత పౌరులుగా ఎదగాలని, సామాజిక అవగాహన పెంపొందించుకోవాలని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు. మంగళవారం మణుగూరులోని ZPHS కో-ఎడ్యుకేషన్ పాఠశాలలో ఉదయం విద్యార్థులతో కలిసి ప్రార్థన గీతంలో పాల్గొన్నారు. అనంతరం పాఠశాలలో ప్రత్యేకంగా నిర్వహించిన సామాజిక అవగాహన కార్యక్రమం లో ఎమ్మెల్యే పాల్గొని విద్యార్థులతో మమేకమయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థుల చదువులు, పాఠశాలలో అందుతున్న సౌకర్యాలు, విద్యా ప్రమాణాలు తదితర అంశాలపై ఎమ్మెల్యే వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుతూ ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు.

**ప్రభుత్వ శాఖలపై విద్యార్థులకు అవగాహన**

ప్రభుత్వ శాఖలు ఎలా పనిచేస్తాయి? ప్రజలకు ఎలాంటి సేవలు అందిస్తాయి? అత్యవసర పరిస్థితుల్లో వివిధ శాఖల పాత్ర ఏమిటి? అనే అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించడమే ఈ ముఖ్య ఉద్దేశమని ఎమ్మెల్యే తెలిపారు. ఎంపీడీవో, ఎంఆర్ఓ, పోలీస్, ఫైర్, వైద్య ఆరోగ్య, గ్రామ పంచాయతీ తదితర ప్రభుత్వ శాఖల విధులు, బాధ్యతలు, ప్రజలకు అందించే సేవల గురించి విద్యార్థులకు వివరించారు. రెవెన్యూ (ఎమ్మార్వో)శాఖ ద్వారా భూములు, రెవెన్యూ, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు తదితర సేవలు అందించే విధానం గురించి వివరించారు.ఎంపీడీవో కార్యాలయం ద్వారా గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలు, గ్రామపంచాయతీల సమన్వయం వంటి అంశాలను విద్యార్థులకు తెలియజేశారు. పోలీస్ శాఖ శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజల భద్రత, చట్టాల అమలులో నిర్వహించే బాధ్యతలను, ఫైర్ శాఖ అగ్ని ప్రమాదాలు మరియు ఇతర అత్యవసర పరిస్థితుల్లో చేపట్టే రక్షణ చర్యలను వివరించారు. అలాగే వైద్య ఆరోగ్య శాఖ ద్వారా ప్రజలకు అందుతున్న వైద్య సేవలు,



ఆరోగ్య పరిరక్షణ, అత్యవసర వైద్య సేవల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. గ్రామపంచాయతీ ద్వారా గ్రామాల్లో పారిశుద్ధ్యం, తాగునీరు, వీధి దీపాలు, స్థానిక అభివృద్ధి కార్యక్రమాలు వంటి ప్రజా సేవలు అందుతున్న తీరును వివరించారు. ప్రభుత్వంలోని ప్రతి శాఖ ప్రజలకు సేవ చేయడమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తుందని, విద్యార్థులు భవిష్యత్తులో బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలంటే ప్రభుత్వ వ్యవస్థ, ప్రజా సేవలు, సామాజిక బాధ్యతలపై అవగాహన కలిగి ఉండటం ఎంతో అవసరమని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, సామాజిక అవగాహన కార్యక్రమాల్లో కూడా చురుకుగా పాల్గొని తమ ప్రతిభను చాటుకోవాలని ఆయన సూచించారు.ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి ప్రార్థనలో పాల్గొని, వారితో ఆత్మీయంగా మాట్లాడిన ఎమ్మెల్యేకు విద్యార్థులు, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, మండల అధ్యక్షులు, టౌన్ అధ్యక్షులు, జిల్లా ముఖ్య నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# మణుగూరు OC-4లో కార్మికుడి మృతి..

- అధికారిక నివేదిక ఎక్కడ?.
- కార్మికుల భద్రతపై సింగరేణి యాజమాన్యం సమాధానం చెప్పాలి..
- దుర్గా ఓబీ కంపెనీలో వరుస ఘటనలపై సమగ్ర విచారణ జరపాలి: బుర్ర సోమేశ్వర్ గౌడ్.

**మణుగూరు.ఆగస్టు 11(డి డి 9వార్త)**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా,మణుగూరు సింగరేణి పరిధిలోని మణుగూరు OC-4 దుర్గా ఓబీ కంపెనీలో కార్మికుడి మృతి ఘటనపై సమగ్ర దర్యాప్తు నిర్వహించి వాస్తవాలను కార్మికులు, ప్రజల ముందుంచాలని తెలంగాణ రాష్ట్ర బీసీ కులాల జేఏసీ కార్యదర్శి, ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇన్‌చార్జ్ బుర్ర సోమేశ్వర్ గౌడ్ డిమాండ్ చేశారు. కార్మికులు తమ కుటుంబాలను పోషించేందుకు ప్రాణాలను పణంగా పెట్టి పనిచేస్తున్నారని, వారి భద్రత విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యం జరిగినా దాని ప్రభావం మొత్తం కుటుంబంపై పడుతుందని ఆయన పేర్కొన్నారు. ఒక కార్మికుడి ప్రాణం కోల్పోవడం కేవలం ఒక కుటుంబానికి జరిగిన నష్టం కాదని, ఆ కుటుంబం భవిష్యత్తుపైనే తీవ్ర ప్రభావం చూపుతుందని అన్నారు. OC-4 దుర్గా కంపెనీలో జరిగిన కార్మికుడి మృతి ఘటనకు సంబంధించి అధికారిక దర్యాప్తు నివేదిక ఏమైంది? ఘటనకు అసలు కారణం ఏమిటి? భద్రతా ప్రమాణాలు పాటించారా? అనే ప్రశ్నలకు సింగరేణి యాజమాన్యం స్పష్టమైన సమాధానం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

**అధికారుల నిఘాలోపమా? కంపెనీ యాజమాన్య నిర్లక్ష్యమా?**

కార్మికుల భద్రతను పర్యవేక్షించాల్సిన అధికారులు నిరంతరం నిఘా కొనసాగిస్తున్నారా? కంపెనీలో భద్రతా నిబంధనలు పూర్తిస్థాయిలో అమలవుతున్నాయా? సేఫ్టీ అధికారుల పర్యవేక్షణ ఎలా ఉంది? అనే అంశాలపై సమగ్ర విచారణ జరగాలని సోమేశ్వర్ గౌడ్ కోరారు. దుర్గా ఓబీ కంపెనీలోనే కార్మికులకు ప్రమాదాలు, మృతి ఘటనలు ఎందుకు చోటుచేసుకుంటున్నాయి? అనే అంశంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, గతంలో జరిగిన ఘటనలను కూడా పరిశీలించి భద్రతా లోపాలపై సమగ్ర నివేదిక రూపొందించాలని కోరారు. కంపెనీ యాజమాన్యం నిర్లక్ష్యం చేసినా, సంబంధిత అధికారులు పర్యవేక్షణలో విఫలమైనా చివరకు నష్టపోయేది కార్మికుడు, అతని కుటుంబమేనని అన్నారు. అందువల్ల కార్మికుల ప్రాణాలతో ఎలాంటి రాజీకి తావివ్వకూడదని స్పష్టం చేశారు.

**కార్మికుల ప్రశ్నలకు సమాధానం చెప్పాలి**

కార్మికులు తమ సమస్యలను స్వేచ్ఛగా చెప్పుకునేందుకు కంపెనీలో సమర్థవంతమైన ఫిర్యాదు వ్యవస్థ ఉందా? భద్రతా సమస్యలను కార్మికులు అధికారుల దృష్టికి తీసుకువస్తే వాటిపై చర్యలు తీసుకుంటున్నారా? కార్మికులపై ఒత్తిళ్లు లేదా బెదిరింపులు ఉన్నాయన్న ఆరోపణల్లో వాస్తవమెంత? అనే అంశాలపైనా అధికారులు స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికుల హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యత యాజమాన్యంతో పాటు సంబంధిత అధికారులపైనా ఉందన్నారు. కార్మికుడు ప్రశ్నిస్తే అతనిపై ఒత్తిడి కాకుండా.. అతని సమస్యకు పరిష్కారం చూపించాల్సిన బాధ్యత యాజమాన్యంపై ఉందని పేర్కొన్నారు.

**మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలి**

ప్రమాదంలో మృతి చెందిన కార్మికుడి కుటుంబాన్ని ఆదుకోవడంతో పాటు, నిబంధనల ప్రకారం రావాల్సిన అన్ని పరిహారాలు వెంటనే అందించాలని డిమాండ్ చేశారు. కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్న రూ.1 కోటి ఎక్స్‌గ్రేషియా అంశాన్ని కూడా ప్రభుత్వం,సింగరేణి యాజమాన్యం సానుకూలంగా పరిశీలించాలని కోరారు.కార్మికుడి ప్రాణానికి విలువ కట్టలేమని, అయితే అతని కుటుంబం భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారకుండా తక్షణ ఆర్థిక, సామాజిక భరోసా కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.

**కార్మికుల ప్రాణాలే మొదటి ప్రాధాన్యత.**

సింగరేణి సంస్థకు, దాని పరిధిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ సంస్థలకు కార్మికుల భద్రతే మొదటి ప్రాధాన్యత కావాలని సోమేశ్వర్ గౌడ్ అన్నారు. లాభాల కోసం కార్మికుల ప్రాణాలను పణంగా పెట్టే పరిస్థితి ఎట్టి పరిస్థితుల్లోనూ ఉండకూడదని స్పష్టం చేశారు. OC-4 దుర్గా ఓబీ కంపెనీలో జరిగిన మృతి ఘటనపై స్వతంత్రంగా, పారదర్శకంగా సమగ్ర విచారణ జరిపి, నివేదికను బహిర్గతం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఘటనకు ఎవరి నిర్లక్ష్యం కారణమని తేలితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. "కార్మికుడు ఇంటి నుంచి పనికి వెళ్లేది తిరిగి కుటుంబం వద్దకు రావాలనే ఆశతో. అతని ప్రాణానికి భద్రత కల్పించడం కంపెనీ, సింగరేణి అధికారుల బాధ్యత. ఆ బాధ్యతలో వైఫల్యం జరిగితే కార్మికుల తరపున ప్రశ్నించడం మా బాధ్యత. కార్మికుల రక్షణ కోసం అవసరమైతే ఎంతవరకైనా పోరాడుతాం" అని బుర్ర సోమేశ్వర్ గౌడ్ స్పష్టం చేశారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం..

- అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి..
- ప్రజాప్రతినిధులతో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సమీక్ష సమావేశం.

**మణుగూరు.ఆగస్టు 11(డి డి 9వార్త)**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక నియోజకవర్గ పరిధిలోని పినపాక, మణుగూరు మండలాల అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారంపై ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ప్రత్యేక దృష్టి సారించారు.మంగళవారం మణుగూరు మండలంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఉదయం పినపాక మండలానికి, మధ్యాహ్నం మణుగూరు మండలానికి చెందిన ప్రజాప్రతినిధులతో ప్రత్యేక సమీక్ష సమావేశాలు నిర్వహించారు. ఆయా మండలాల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతి, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరుతున్నాయా లేదా అనే అంశాలపై గ్రామాల వారీగా సమీక్షించారు. సమావేశంలో సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, ఎంపీటీసీలు, మండల స్థాయి ప్రజాప్రతినిధులు, పార్టీ మండల అధ్యక్షులు, మండల నాయకులు, ముఖ్య కార్యకర్తలు, గ్రామస్థాయి నాయకులు పాల్గొని తమ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ప్రతి పంచాయతీలో ప్రధానంగా ఉన్న తాగునీటి సమస్య, అంతర్గత రహదారులు, డ్రైనేజీలు, సీసీ రోడ్లు, వీధి దీపాలు, పారిశుధ్యం, విద్యుత్ సమస్యలు, సాగునీటి వసతులు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ భవనాలు, రేషన్, పెన్షన్లు, ఇందిరమ్మ ఇళ్లు తదితర అంశాలపై ఎమ్మెల్యే ప్రజాప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు. అలాగే గ్రామాల్లో చేపట్టిన సీసీ రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి సరఫరా, పంచాయతీ భవనాలు, కమ్యూనిటీ హాళ్లు, పాఠశాలలు, ఇతర మౌలిక వసతుల పనుల ప్రస్తుత పరిస్థితిపై వివరాలు తెలుసుకున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల విషయంలో అర్హులైన ఒక్క కుటుంబం కూడా మిగిలిపోకుండా ప్రజాప్రతినిధులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎమ్మెల్యే సూచించారు. ఇందిరమ్మ ఇళ్లు, రైతు సంక్షేమం, పెన్షన్లు, రేషన్, మహిళా సంక్షేమ పథకాలు, విద్య, వైద్యం తదితర ప్రభుత్వ పథకాల అమలులో గ్రామస్థాయిలో ఎదురవుతున్న సమస్యలను గుర్తించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని అన్నారు.ప్రజలకు ప్రభుత్వ పథకాలపై పూర్తి అవగాహన కల్పించడంతో పాటు, అర్హత ఉన్నప్పటికీ పథకాలు అందని వారి వివరాలను సేకరించి పరిష్కారానికి కృషి చేయాలని ప్రజాప్రతినిధులకు సూచించారు. గ్రామాల్లో మంజూరైన అభివృద్ధి పనులను కేవలం ప్రారంభించడం కాకుండా పనులు వేగంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఎమ్మెల్యే అన్నారు. జరుగుతున్న పనుల్లో నాణ్యత విషయంలో రాజీ పడకూడదని, ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. గ్రామాల్లో అత్యవసరంగా పరిష్కరించాల్సిన సమస్యలను ప్రజాప్రతినిధులు గుర్తించి తన దృష్టికి తీసుకువస్తే సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.ప్రజలకు ప్రభుత్వానికి మధ్య ప్రజాప్రతినిధులు కీలక వారధిగా వ్యవహరించాలని పాయం వెంకటేశ్వర్లు అన్నారు. సర్పంచులు, వార్డు సభ్యులు, మండల నాయకులు, పార్టీ కార్యకర్తలు గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను తెలుసుకోవాలని సూచించారు.

అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలులో ఎక్కడైనా ఇబ్బందులు ఎదురైతే వాటిని వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలని అన్నారు. గ్రామస్థాయి నుంచి మండల స్థాయి వరకు సమన్వయంతో పనిచేస్తేనే నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేయగలమని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

పినపాక, మణుగూరు మండలాల్లోని ప్రతి గ్రామానికి సమాన ప్రాధాన్యతనిస్తూ మౌలిక వసతుల కల్పన, ప్రజా సమస్యల పరిష్కారం, సంక్షేమ పథకాల అమలుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు.

ఈ సమావేశంలో ఆయా మండలాలకు చెందిన ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మణుగూరు పోలీసు శాఖ ఆధ్వర్యంలో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం..

- డీఎస్పీ రవీందర్ రెడ్డి పర్యవేక్షణలో క్షుణ్ణంగా తనిఖీలు..
- ప్రజలకు చేరువయ్యేందుకే కమ్యూనిటీ కాంటాక్ట్ -- డీఎస్పీ.

**మణుగూరు.ఆగస్టు 11(డి డి 9వార్త)**





భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని శివలింగాపురం ప్రాంతంలో మంగళవారం నాడు మణుగూరు డీఎస్పీ రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. నివాస గృహాల్లో అడుగడుగునా తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో 147 వాహనాలకు సంబంధించిన పాత పెండింగ్ చలాన్ ల ద్వారా మొత్తం 35 వేల రూపాయలు వసూలు చేశామన్నారు.నిబంధనలను ఉల్లంఘించిన వారిపై 13 స్పాట్ కేసులు నమోదు చేసి, సరైన నెంబర్ ప్లేట్లు లేని మూడు బైక్ లను స్వాధీనం చేసుకున్నామని పోలీసులు తెలిపారు.అక్రమంగా నిల్వ చేసిన 35 వేల రూపాయల విలువైన మద్యాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని తెలిపారు. ఈ సందర్భంగా డీఎస్పీ రవీందర్ రెడ్డి మాట్లాడుతూ,ప్రజలకు మరింత చేరువయ్యేందుకే కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్టు తెలిపారు.గ్రామాల్లో, కాలనీ లలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకోవడం తోపాటు,ప్రజలకు పోలీసులపై నమ్మకం పెంచేందుకు ఈ కార్యక్రమం చేపడుతున్నామని ఆయన అన్నారు. ప్రజలు ఎటువంటి సమస్యలను ఎదుర్కొన్నా వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ రవీందర్ రెడ్డి హెచ్చరించారు. ఈ తనిఖీల్లో సీఐ నాగబాబు, సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై నగేష్, ఎస్సై రాజేష్, ఏఎస్సై భాస్కరరావు, హెడ్ కానిస్టేబుల్ దామోదర్, బాలాజీ,మురారి, కాశి,బుచ్చిబాబు,శంకర్, ఝాన్సీ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రతి షాపింగ్ కాంప్లెక్స్‌పై లబ్ధిదారుల వివరాలు ఏర్పాటు చేయాలి

- తిలక్‌నగర్ కాంప్లెక్స్‌ను పరిశీలించిన సీపీఐ.. 24 గంటల్లో వివరాలు వెల్లడించాలని డిమాండ్

**పెద్దపల్లి బ్యూరో, ఆగస్టు 11 (డీడీ9 వార్త):**




రామగుండం నగర పాలక సంస్థ పరిధిలో నిర్మాణంలో ఉన్న ప్రతి షాపింగ్ కాంప్లెక్స్‌పై లబ్ధిదారుల వివరాలను బహిరంగంగా ఏర్పాటు చేయాలని సీపీఐ ఫ్లోర్ లీడర్ మార్కపురి సూర్య, సీపీఐ శాఖ కార్యదర్శి శనిగరపు చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. తిలక్‌నగర్ షాపింగ్ కాంప్లెక్స్‌ను వారు పరిశీలించి, అక్కడ లబ్ధిదారుల వివరాలను వెల్లడిస్తూ బోర్డు ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..... గత కొన్ని రోజులుగా కూల్చివేతలు, నిర్మాణాలకు అనుమతులపై పరస్పర విరుద్ధ ప్రకటనలతో చిరు వ్యాపారులను తీవ్ర భయాందోళనలకు గురిచేస్తున్నారని ఆరోపించారు. మరోవైపు ప్రజా సమస్యలపై ఎమ్మెల్యే స్పందించకపోవడాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నామని అన్నారు. ఎల్‌బీనగర్‌లో ఎలాంటి అక్రమాలు జరగలేదని, తమ డిమాండ్ మేరకు లబ్ధిదారుల వివరాలను వెంటనే బోర్డుపై ఏర్పాటు చేశారని తెలిపారు. అదే విధంగా రామగుండం కార్పొరేషన్ పరిధిలోని రాజేష్ థియేటర్ సమీపంలో, తిలక్‌నగర్ సెంటర్, బస్టాండ్ కాలనీ ప్రాంతాల్లో నిర్మాణంలో ఉన్న ప్రతి షాపింగ్ కాంప్లెక్స్‌పై లబ్ధిదారుల వివరాలను ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేను కోరారు. తిలక్‌నగర్ సెంటర్‌లో కాంప్లెక్స్ నిర్మాణానికి భూమిపూజ జరిగిన సమయంలో ఆర్జీ–1 జీఎం హాజరయ్యారని, ప్రస్తుతం అనుమతులు లేవంటూ ఎస్ఎన్‌పీసీ సిబ్బందిని అక్కడ కాపలాగా ఉంచడం సరికాదని విమర్శించారు. ఆర్జీ–1 జీఎం రాజకీయాలకు దూరంగా ఉండి తన విధులను నిర్వర్తించాలని సూచించారు. లబ్ధిదారుల వివరాలు జీఎం వద్ద ఉన్నాయా? అని ప్రశ్నించిన సీపీఐ నాయకులు, వివరాలు లేనట్లయితే ఏ ఆధారాలతో కూల్చివేతలు చేపడుతున్నారో బహిరంగపరచాలని డిమాండ్ చేశారు. నిర్మాణంలో ఉన్న ప్రతి షాపింగ్ కాంప్లెక్స్‌కు సంబంధించిన లబ్ధిదారుల వివరాలు, ప్రొసీడింగ్స్ కాపీలు, సింగరేణి నుంచి అవసరమైన పత్రాలు ఇప్పించడంతో పాటు మున్సిపల్ అధికారుల నుంచి బిల్డింగ్ అనుమతులు ఇప్పించాలని ఎమ్మెల్యేను గతంలో కోరినా ఇప్పటివరకు స్పందించలేదని అన్నారు. రామగుండం కార్పొరేషన్ పరిధిలోని అన్ని షాపింగ్ కాంప్లెక్స్‌ల లబ్ధిదారుల వివరాలను 24 గంటల్లో పూర్తిస్థాయిలో బహిరంగపరచాలని, లేనిపక్షంలో భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ముట్టడిస్తామని సీపీఐ నాయకులు హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆసాల నవీన్, కొండ్ర దాసు పాల్గొన్నారు.

# ఆగస్టు 17న ఏటూరునాగారం ఐటీడీఏ ముట్టడి..

**జీవో–3ను పునరుద్ధరించాలి.. 1/70 చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి..**

**ఆగస్టు 11: డిడి9 వార్త వెంకటాపురం.**



ఆదివాసీల హక్కుల పరిరక్షణ కోసం ఆగస్టు 17న చేపట్టనున్న ఏటూరునాగారం ఐటీడీఏ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆదివాసీ సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. వెంకటాపురంలో తుడుందెబ్బ ఆధ్వర్యంలో ఐటీడీఏ ముట్టడి వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. తుడుందెబ్బ జాతీయ ఉపాధ్యక్షులు యాసం రాజు మాట్లాడుతూ.. ఏజెన్సీ ప్రాంతంలో వన్ ఆఫ్ 70 చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని, జీవో–3ను పునరుద్ధరించి చట్టం చేయాలని డిమాండ్ చేశారు. అటవీ హక్కుల చట్టం ప్రకారం సాగులో ఉన్న పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని, సుమారు 8 లక్షల ఎకరాల పోడు భూములకు హక్కు పత్రాలు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. "5వ షెడ్యూల్ ప్రాంతం మా భూమి.. మా హక్కు" అనే నినాదంతో జరిగే ఐటీడీఏ ముట్టడికి ఆదివాసీలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆదివాసీ నవనిర్మాణ సేన, గోండ్వానా సంక్షేమ పరిషత్, తెలంగాణ భూమిపుత్ర ఆదివాసీ సంఘం, తుడుందెబ్బ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నిరుపేదకు ఉచితంగా కృత్రిమ కాలు

**ఆలయ ఫౌండేషన్ చొరవతో దుర్గం మారుతికి అండ**

**పెద్దపల్లి బ్యూరో, ఆగస్టు 11 (డీడీ9 వార్త):**





హాజీపూర్ మండలం గుడిపేట గ్రామానికి చెందిన దుర్గం మారుతి ప్రమాదవశాత్తు కుడికాలు కోల్పోవడంతో కృత్రిమ కాలు అవసరమైంది. దీంతో ఆలయ ఫౌండేషన్ డిప్యూటీ సీఈఓ కీర్తి నాగార్జున , సభ్యులు అక్రంను సంప్రదించారు. ఆలయ ఫౌండేషన్ మార్గదర్శకులు పి. నరహరి ఐఏఎస్ చొరవతో హైదరాబాద్‌లోని భగవాన్ మహావీర్ ట్రస్ట్ సహకారంతో మారుతికి ఉచితంగా కృత్రిమ కాలు అమర్చారు. దీంతో ప్రమాదం కారణంగా కాలు కోల్పోయిన బాధితుడికి నడిచే అవకాశం లభించింది. ఈ సందర్భంగా దుర్గం మారుతి కుటుంబ సభ్యులు మాట్లాడుతూ... ఆపదలో ఉన్న తమకు అండగా నిలిచి ఉచితంగా కృత్రిమ కాలు అందించిన ఆలయ ఫౌండేషన్ ప్రతినిధులకు, పి. నరహరి ఐఏఎస్‌కు, భగవాన్ మహావీర్ ట్రస్ట్ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి ఇలాంటి సేవలు అందించడం అభినందనీయమని పేర్కొన్నారు.

## భద్రాచలంలో వైభవంగా భద్రాద్రి రామయ్య కల్యాణం



**భద్రాచలం , ఆగస్టు 11 (డిడి9 వార్త)**

భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారి నిత్యకల్యాణం వైభవంగా జరిగింగి. మిథిలా స్టేడియంలోని శ్రీరామసేవ మండపంకు స్వామి వారిని అందంగా అలంకరించి మేళతాళాలు, భాజభజంత్రీల నడుమ తీసుకొచ్చి వేదికపై ఆసీనులను చేశారు. అనంతరం స్వామి వారికి నిత్యకల్యాణం ఘనంగా జరిగింది. విశ్వక్సేన అర్చన, పుణ్యహావచనం, కంకణదారణ, యజ్ఞోపవీతదారణ, జీలకరబెల్లం, మాంగల్యదారణ, తలంబ్రాలు, వేద ఆశీర్వచనం ను వైదిక బృందం నిర్వహించారు.

## గ్రీన్ భద్రాద్రి ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం



**భద్రాచలం , ఆగస్టు 11 (డిడి9 వార్త)**

భద్రాచలం పట్టణాన్ని పచ్చని వసంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో గ్రీన్ భద్రాద్రి–భద్రాచలం అధ్వర్యంలో మంగళవారం చర్ల రోడ్లోని ఎస్బీఐ బ్రాంచ్ కార్యాలయం ముందు మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్బీఐ మేనేజరు సత్య మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని తెలిపారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన వాతావరణం అర దించాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. అలాగే గ్రీన్ భద్రాద్రి ఆధ్యక్షులు ఆర్. రామకృష్ణ రెడ్డి మాట్లాడుతూ ప్రతి పోరుడు తన వంతు బాధ్యతగా స్వీకరించాలని అన్నారు. ప్రతి ఒక్కరూ కనీసం ఒక్క మొక్క–వైనా నాటి, అది పెద్ద వృక్షంగా ఎదిగే వరకు సంరక్షించాలని కోరారు.

## వివాహ వేడుక..సేవా సందడి..

- గడ్డం వినోద్ వివాహ వేడుక.. కార్యకర్తలు సేవా బాట!..
- రోగులకు పండ్ల పంపిణీ..

**మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఆగస్టు 11**

ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకట్ స్వామి, గడ్డం రమాదేవి దంపతుల వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణ కాంగ్రెస్ నాయకులు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రత్యేక సందర్భాన్ని ప్రజలకు ఉపయోగపడే విధంగా సేవా కార్యక్రమాలతో నిర్వహించడం అభినందనీయమని నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా బెల్లంపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ దావా స్వాతి రమేష్ బాబు, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బండి ప్రభాకర్ యాదవ్ ఆధ్వర్యంలో బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు పంపిణీ చేశారు. రోగుల వద్దకు వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. 19వ వార్డు బెల్లంపల్లి బస్తీ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కాంపెల్లి శ్రీనివాస్ ఆసుపత్రిలోని రోగులను పరామర్శించి, వారి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. త్వరగా కోలుకుని ఆరోగ్యంగా ఇంటికి చేరుకోవాలని ఆకాంక్షిస్తూ వారికి పండ్లు అందజేశారు. వివాహ వార్షికోత్సవం వంటి ప్రత్యేక సందర్భాలను సేవా కార్యక్రమాలతో జరుపుకోవడం ద్వారా సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలకు ప్రాధాన్యతనిస్తున్నామని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. ప్రజలకు అండగా నిలుస్తూ భవిష్యత్తులోనూ మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు..

## ఉపాధ్యాయులు గిరిజన బాల బాలికల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

### భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాహుల్



**భద్రాచలం , ఆగస్టు 11 (డిడి9 వార్త)**

గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాల, జిపిఎస్ పాఠశాలల్లో చదివే గిరిజన బాల బాలికలు తల్లిదండ్రుల తర్వాత గురువులనే తల్లిదండ్రులుగా భావిస్తారని, అటువంటి పిల్లలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా జిపిఎస్ పాఠశాలల్లో విద్యాబుద్ధులు నేర్పించి వారి భవిష్యత్తును బాగుపడేలా సంబంధిత ఉపాధ్యాయులు కృషి చేయాలని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ అన్నారు. మంగళవారం భద్రాచలం పట్టణంలోని బీఈడీ కళాశాలలో జిపిఎస్, ఏపీఎస్, ఏహెచ్ఎస్ పాఠశాలల ఉపాధ్యాయులకు ఉద్దీపకం వర్క్ బుక్ –3, నిర్వహణపై రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు పలు సూచనలు ఇస్తూ గిరిజన సంక్షేమ జిపిఎస్, ఆశ్రమ పాఠశాలలో చదివే గిరిజన బాల బాలికల విద్యాభ్యాసం పటిష్టం చేయడానికి గత సంవత్సరం ఉద్దీపకం వర్క్ బుక్ ఒకటి, రెండు ప్రవేశ పెట్టడం వలన విద్యాభ్యాసం కాస్త మెరుగుపడిందన్నారు. పిల్లల్లో ఇంకా ప్రతిభా పాటవాలు మెరుగుపడటానికి ఉద్దీపకం వర్క్ బుక్ 3లో పిల్లల చదువు, నైపుణ్యాలు మెరుగుపడేలా అలాగే కాంపిటేటివ్ పరీక్షలకు సిద్ధమయ్యేలా ఉద్దీపకం రూపొందించడం జరిగిందన్నారు. అదేవిధంగా పిల్లల యొక్క నైపుణ్యా,లు యొక్క ప్రతిభను పరీక్షించడానికి పరీక్షలు నిర్వహించినప్పుడు పిల్లలు ఎవరికి వారే సొంతంగా రాసేలా ఉపాధ్యాయులు చూడాలని పిల్లలకు మాత్రం పరీక్షలు రాసే సమయంలో ఉపాధ్యాయులు సహకరించవద్దని అన్నారు. గురువులు చెప్పిన మాట పిల్లలు తప్పనిసరిగా విని ఆచరణలో పెడతారని అందుకు ఎస్టిటి ఉపాధ్యాయులు గిరిజన చిన్నారులపై ప్రత్యేక దృష్టి సారించి పిల్లలందరూ గురుకులం ◌ాంపిటేటివ్ పరీక్షలలో ఉత్సాహంగా పాల్గొని సీట్లు సంపాదించే విధంగా నైపుణ్యాలను మేధాశక్తిని పెంపొందించేలా విద్యాబుద్ధులు నేర్పించాలని అన్నారు. ఉద్దీపకం వర్క్ బుక్ 3 పై చక్కటి గేయం రచించిన మణుగూరు మండలం ఇప్పల సింగారం గ్రామంలోని జిపిఎస్ పాఠశాల ఉపాధ్యాయుడు రాఘవేంద్రను అభినందించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం డిడి ట్రైబల్ వెల్ఫేర్ ఫిరంగి, భద్రాచలం డిడి ట్రైబల్ వెల్ఫేర్ శ్రీమతి చందన, బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ భవాని, ఏ సీఎంఓ రమేష్, ఏటీడీవోలు చంద్రమోహన్, రాధమ్మ, జె సి డి వో అలివేలు మంగతాయారు పాల్గొన్నారు.

## నిధులు సిద్ధం.. స్థలం ఎక్కడ..?

### వీవో భవనానికి స్థలం కేటాయించాలి.. సర్పంచ్.

**ఆగస్టు 11 .డిడి 9వార్త**
**వెంకటాపురం.**



వెంకటాపురం మండలం బెస్తగూడెం గ్రామపంచాయతీ పరిధిలో వీవోల సమావేశ భవన నిర్మాణానికి తక్షణమే ప్రభుత్వ స్థలాన్ని కేటాయించాలని కోరుతూ గ్రామ సర్పంచ్ మడే భీమేశ్వరి, వీవో కోడారి జ్యోతి మంగళవారం తహసీల్దార్ వేణుగోపాల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వీవోల సమావేశ భవన నిర్మాణానికి ప్రభుత్వం ఇప్పటికే నిధులు మంజూరు చేసిందని, అయితే భవనం నిర్మించేందుకు అనువైన ప్రభుత్వ స్థలం అందుబాటులో లేకపోవడంతో నిర్మాణ పనులు ప్రారంభించలేకపోతున్నామని తెలిపారు. గ్రామస్తులు, వీవోల సమావేశాలకు ఉపయోగపడేలా భవనం నిర్మాణం ఎంతో అవసరమని, ఈ సమస్యను అధికారులు తక్షణమే పరిష్కరించాలని కోరారు. వినతిపత్రంపై తహసీల్దార్ వేణుగోపాల్ సానుకూలంగా స్పందిస్తూ, గ్రామస్తులందరికీ అనుకూలంగా ఉండే ప్రభుత్వ స్థలాన్ని త్వరలో గుర్తించి, భవన నిర్మాణానికి కేటాయిస్తామని హామీ ఇచ్చినట్లు సర్పంచ్ మడే భీమేశ్వరి తెలిపారు.

## ఈ-పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్లు వేతనాలను తక్షణమే విడుదల చేయండి

### ఎంపీడీవో,ఎంపీవోకి వినతి పత్రం అందజేసిన ఆపరేటర్లు



**బోనకల్,ఆగస్టు 11, డీడీ 9 వార్త:**

గత నాలుగు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను తక్షణమే విడుదల చేయాలని ఎంపీడీఓ,ఎంపీవో కు మంగళవారం ఈ–పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్లు వినతి పత్రం అందజేశారు.బోనకల్ మండల పరిషత్ కార్యాలయంలో ఈ–పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్లుగా విధులు నిర్వహిస్తు,ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా, గ్రామ పంచాయతీల్లో పారదర్శక సేవలను అందిస్తూ కార్యాలయ నిర్వహణలో కీలక పాత్ర పోషిస్తున్నామనీ తెలిపారు,గత నాలుగు నెలలుగా తమకు వేతనాలు చెల్లించకపోవడంతో కుటుంబాలు ఇంటి అద్దెలు చెల్లించలేక యజమానుల నుంచి తీవ్ర ఒత్తిడి ఎదుర్కొంటున్నామని పిల్లల పాఠశాల ఫీజులు, పుస్తకాలు మరియు నిత్యావసర ఖర్చులు భరించలేకపోతున్నాము. వైద్య అవసరాలకు కుటుంబ పోషణకు డబ్బులు లేక అప్పులపాలవుతున్నామనీ ఆవేదన వ్యక్తం చేశారు,పనులు పూర్తి స్థాయిలో తమతో చేయించుకుంటూ జీతాలు నిలిపివేయడం పట్ల కుటుంబాలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నాయన్నారు,మానవతా దృక్పథంతో స్పందించి పెండింగ్‌లో ఉన్న నాలుగు నెలల వేతనాలను తక్షణమే విడుదల చేసి ఇకపై ప్రతి నెలా క్రమం తప్పకుండా వేతనాలు అందేలా చర్యలు తీసుకోవాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో కంప్యూటర్ ఆపరేటర్లు ఉన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కొత్త యూనిఫామ్స్ ఎక్కడ!!!

- పంద్రాగస్టు వేడుకలు పాత దుస్తులతోనేనా!!
- డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కొంటు సాగర్

**పెద్దపల్లి బ్యూరో, ఆగస్టు 11 (డీడీ9 వార్త):**



ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కొత్త యూనిఫామ్స్ అందించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) పెద్దపల్లి జిల్లా కార్యదర్శి కొంటు సాగర్ ఆరోపించారు. పాఠశాలలు ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్నా విద్యార్థులకు కొత్త యూనిఫామ్స్ అందక పోవడంపై రాష్ట్ర ప్రభుత్వ తీరును ప్రశ్నించారు.

రాష్ట్ర ప్రభుత్వం 2026–27 విద్యా సంవత్సరం నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ప్రతి విద్యార్థికి కొత్త యూనిఫామ్ అందిస్తామని ప్రకటించిందని, గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో అందించిన యూనిఫామ్ నాణ్యత సరిగా లేదని, ఈసారి యూనిఫామ్ రంగు మార్చి 'ఒకే రాష్ట్రం.. ఒకే యూనిఫామ్' విధానం అమలు చేస్తామని చెప్పిందని తెలిపారు. అయితే విద్యా సంవత్సరం ప్రారంభమై రెండు నెలలు గడిచినా ఆచరణలో మాత్రం యూనిఫామ్స్ అందలేదని విమర్శించారు

విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్ అందిస్తామని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ ఇప్పటివరకు పాఠ్యపుస్తకాలు మాత్రమే అందాయని, యూనిఫామ్స్ అందకపోవడంతో పంద్రాగస్టు వేడుకలను విద్యార్థులు పాత దుస్తులతోనే జరుపుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో సుమారు 26 లక్షల మంది విద్యార్థులు ఉన్నారని, రామగుండం మండలంలో సుమారు 4,586 మంది విద్యార్థులు ఉన్నప్పటికీ ఇప్పటివరకు పూర్తిస్థాయిలో యూనిఫామ్స్ అందకపోవడానికి ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని ఆరోపించారు.

**21 రకాల వస్తువుల కిట్ ఎక్కడ!**

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల తల్లిదండ్రులపై ఆర్థిక భారం పడకుండా ఈ విద్యా సంవత్సరం నుంచి 21 రకాల వస్తువులతో కూడిన కిట్ అందజేస్తామని ప్రభుత్వం ప్రకటించిందని, ఇప్పటివరకు ఆ కిట్‌లు ఎందుకు అందించలేదో ముఖ్యమంత్రి సమాధానం చెప్పాలని డీవైఎఫ్ఐ నాయకుడు డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల సమస్యలతో పాటు కళాశాల విద్యార్థులకు సైతం పూర్తిస్థాయిలో ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు అందించడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. విద్యాశాఖకు మంత్రిని కేటాయించాలి విద్యార్థుల సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యాన్ని వీడి వెంటనే చర్యలు తీసుకోవాలని, విద్యాశాఖకు ప్రత్యేకంగా ఒక మంత్రిని కేటాయించాలని డిమాండ్ చేశారు. ఆగస్టు 15లోపు రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కొత్త యూనిఫామ్స్ అందేలా యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని, పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని కొంటు సాగర్ డిమాండ్ చేశారు.

## అర్హులందరికీ చేయూత ఫించన్ అందాలి

### డివిజన్లలో విస్తృత అవగాహన కల్పించాలి.. మేయర్ మహంకాళి స్వామి

**పెద్దపల్లి బ్యూరో, ఆగస్టు 11 (డీడీ9 వార్త):**



అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ చేయూత ఫించన్ పథకం ద్వారా లబ్ధి పొందేలా డివిజన్లలో విస్తృత అవగాహన కల్పించాలని రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి వార్డు అధికారులను ఆదేశించారు. కొత్తగా చేయూత ఫించన్లకు దరఖాస్తులు స్వీకరించేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన నేపథ్యంలో మంగళవారం రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలో వార్డు అధికారులకు ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ..... చాలా ఏళ్ల తర్వాత కొత్త ఫించన్లకు మార్గం సుగమం అయిందని, కార్పొరేటర్ల సమన్వయంతో వార్డుల్లో విస్తృత ప్రచారం నిర్వహించి అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరించాలని సూచించారు. ఆదాయ, మరణ, వైద్య ధ్రువీకరణ పత్రాలతో పాటు అవసరమైన ఇతర పత్రాలను సంబంధిత కార్యాలయాలు త్వరితగతిన జారీ చేసేలా అధికారులకు ఆదేశాలు ఇస్తామని తెలిపారు. రామగుండం నగర పాలక సంస్థ పరిధిలో ఇప్పటికే 19,659 మంది చేయూత ఫించన్ పొందుతున్నారని, మరో 2,068 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని మేయర్ తెలిపారు. పెండింగ్ దరఖాస్తుల విచారణను వెంటనే పూర్తి చేసి అర్హుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. ఎలాంటి పొరపాట్లు, అవకతవకలకు తావులేకుండా పారదర్శకంగా విచారణ నిర్వహించాలని సూచించారు. ఫైలేరియా, డయాలసిస్ బాధితులకు కూడా ఫించన్లు మంజూరు చేయాలని ప్రభుత్వం నిర్ణయించడం హర్షణీయమన్నారు. స్థానికంగా ఉన్న ఫైలేరియా, డయాలసిస్ బాధితుల జాబితాను పరిసర ప్రాంతాల్లోని ఆసుపత్రుల నుంచి సేకరించి, అర్హులకు అవగాహన కల్పించి దరఖాస్తు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. అదనపు కలెక్టర్ రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ జె. అరుణశ్రీ మాట్లాడుతూ... వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, చేనేత, గీత కార్మికులు, డయాలసిస్, ఫైలేరియా బాధితులు కొత్త ఫించన్ల కోసం దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. దరఖాస్తుతో పాటు అవసరమైన పత్రాలను జతచేసి వార్డు అధికారికి లేదా నగర పాలక సంస్థ కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. ప్రతి దరఖాస్తుతో ఆధార్ కార్డు, రేషన్ కార్డు, 2026–27 సంవత్సరానికి సంబంధించిన తాజా ఆదాయ ధ్రువీకరణ పత్రం తప్పనిసరిగా జత చేయాలని తెలిపారు. వితంతువులు భర్త మరణ ధ్రువీకరణ పత్రం, ఒంటరి మహిళలు విడాకుల పత్రం, దివ్యాంగులు సదరం ధ్రువీకరణ పత్రం, గీత కార్మికులు కల్లుగీత సొసైటీ సభ్యత్వం, ఎక్సైజ్ శాఖ ధ్రువీకరణ పత్రం, చేనేత కార్మికులు జౌళి శాఖ ధ్రువీకరణ పత్రం సమర్పించాల్సి ఉంటుందని వివరించారు. సమావేశంలో నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకటస్వామి, సెక్రటరీ మహేశ్వర్ రెడ్డి, సూపరింటెండెంట్ పబ్బాల శ్రీనివాస్, ఫించన్ విభాగం ఇన్‌చార్జి సాగర్ తదితరులు పాల్గొన్నారు.

## పత్రికా స్వేచ్ఛని అణిచివేసే ప్రయత్నాలు సహించం...

- కలం కదిలితే.. అవినీతి,అక్రమాలు జడవాల్సిందే..
- జర్నలిస్టుల గొంతు నొక్కొద్దు..
- జర్నలిస్టులను టార్గెట్ చేస్తే ఊరుకునేది లేదు.
- మండలంలోని జర్నలిస్టులంతా ఐక్యంగా నిలబడి పత్రికా స్వేచ్ఛ కోసం పోరాడతాం..

**మణుగూరు.ఆగస్టు 11 (డి డి 9వార్త)**



ప్రజాస్వామ్య వ్యవస్థలో పత్రికా రంగం నాలుగో స్తంభంగా ప్రజల తరఫున ప్రశ్నించే కీలక బాధ్యతను నిర్వహిస్తోందని భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1)(a) కల్పించిన భావ ప్రకటన స్వేచ్ఛ పరిధిలో పత్రికా స్వేచ్ఛ కి రక్షణ ఉందని అశ్వాపురం మండల జర్నలిస్టులు పేర్కొన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు నిర్వహించే విలేకరుల సమావేశాల్లో వారు వెల్లడించిన అభిప్రాయాలను ప్రజలకు చేరవేయడం జర్నలిస్టుల వృత్తి బాధ్యతలో భాగమన్నారు. విలేకరుల సమావేశంలో ఎవరు ఏం మాట్లాడారో వాస్తవాల ఆధారంగా వార్తగా రాయడమే తప్ప, జర్నలిస్టులు స్వతహాగా ఊహించుకుని వార్తలు సృష్టించరని స్పష్టం చేశారు. వార్తలో వాస్తవ దోషం ఉంటే వివరణ ఇవ్వాలి.కానీ వార్త రాసిన జర్నలిస్టుపై ఒత్తిడి తీసుకురావడం సరికాదని అన్నారు.ప్రజా సమస్యలు, అవినీతి, అక్రమాలు, అధికారుల నిర్లక్ష్యం, బాధితుల గోడును వెలుగులోకి తీసుకురావడంలో మీడియా ఎన్నో సందర్భాల్లో కీలక పాత్ర పోషించిందన్నారు.కలం ప్రశ్నించినప్పుడు వ్యవస్థ సమాధానం చెప్పాలి. కలాన్ని ప్రశ్నించడం ద్వారా సమస్య పరిష్కారం కాదని పేర్కొన్నారు.వార్తలపై అభ్యంతరాల పేరుతో జర్నలిస్టులపై ఫిర్యాదులు చేయడం, ఒత్తిళ్లు తీసుకురావడం పత్రికా స్వేచ్ఛని హరించే చర్యలుగా భావిస్తున్నామని తెలిపారు.వార్త నచ్చకపోతే ఖండన ఇవ్వడానికి, తమ వాస్తవాలను ప్రజల ముందు ఉంచడానికి ప్రతి ఒక్కరికీ అవకాశం ఉందన్నారు.

**"సమస్య వస్తే ఐక్యంగా పోరాడుతాం".**

జర్నలిస్టుల గొంతు నొక్కడం కాదు.. ప్రజల సమస్యలకు పరిష్కారం చూపడమే పాలకుల బాధ్యత అని, మండలంలోని ఏ జర్నలిస్టు కైనా ఏ సమస్య వచ్చినా ఐక్యంగా పోరాడతామని స్పష్టం చేశారు.ప్రజా ప్రయోజనాల కోసం నిజాలను వెలుగులోకి తీసుకురావడంలో జర్నలిస్టులు ఎలాంటి ఒత్తిళ్లకు తలొగ్గకుండా తమ వృత్తి ధర్మాన్ని కొనసాగిస్తారని తెలిపారు.ఒక జర్నలిస్టుపై అనవసర ఒత్తిడి వచ్చినా అశ్వాపురం మండలంలోని జర్నలిస్టులంతా ఐక్యంగా నిలబడి పత్రికా స్వేచ్ఛని కాపాడేందుకు కృషి చేస్తామని ప్రకటించారు. జర్నలిస్టును ఆపితే ఒక వార్త ఆగవచ్చు కానీ ప్రజల ప్రశ్నలను ఆపలేరు అని స్పష్టం చేశారు.పత్రికా స్వేచ్ఛని గౌరవించడం అంటే కేవలం జర్నలిస్టుల హక్కును గౌరవించడం కాదని, ప్రజలకు నిజం తెలుసుకునే హక్కును గౌరవించడమేనన్నారు. కలం ఆగదు,ప్రశ్న ఆగదు,ప్రజల కోసం పత్రికా స్వరం కూడా ఆగదని అశ్వాపురం మండల వ్యాప్తంగా ఏ జర్నలిస్టు కైనా ఇబ్బందులు తలపెడితే మండల వ్యాప్తంగా ఉన్న అన్ని క్లబ్ లోని జర్నలిస్టులు ఐక్యంగా పోరాడతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మండలంలోని ప్రెస్ క్లబ్ ల అధ్యక్షులు రాజేందర్ వెలమ, మహేష్ ,చలపతి రావు,కల్లూరు నరసింహారావు, ప్రెస్ క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## భద్రాచలం ప్రభుత్వ డిగ్రీ కళాశాల సెమిస్టర్ ఫలితాలు విడుదల

- డిగ్రీ ఫలితాల్లో మెరిసిన భద్రాచలం ప్రభుత్వ కళాశాల విద్యార్థులు
- ఉన్నత ఆశయాలతో విద్యను అభ్యసించాలి: ప్రొఫెసర్ డి.ఎస్.ఆర్. రాజేంద్ర సింగ్

**భద్రాచలం ఆగస్టు 11 (డిడి9 వార్త)**



భద్రాచలం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల (స్వయం ప్రతిపత్తి)లో గత ఏప్రిల్/మే నెలల్లో నిర్వహించిన 2 మరియు 4వ సెమిస్టర్ల పరీక్షా ఫలితాలను కాలేజీయేట్ ఎడ్యుకేషన్ జాయింట్ డైరెక్టర్ ప్రొఫెసర్ డి.ఎస్.ఆర్. రాజేంద్ర సింగ్ మంగళవారం ఘనంగా విడుదల చేశారు. ఈ సందర్భంగా కళాశాల ఫలితాలపై జాయింట్ డైరెక్టర్ సంతృప్తి వ్యక్తం చేస్తూ, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జాన్ మిల్టన్ మరియు అధ్యాపక బృందాన్ని ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం విద్యార్థులతో ఏర్పాటు చేసిన ముఖాముఖి కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. విద్యార్థులు ఉన్నత ఆశయాలతో విద్యను అభ్యసించాలని, తద్వారా జీవితంలో అత్యుత్తమ శిఖరాలను అధిరోహించాలని పిలుపునిచ్చారు. ఇదే వేదికగా ఏఈడీపీ (AEDP) కోర్సులు, విద్యార్థుల జిజ్ఞాస ప్రాజెక్టులు, అలాగే ప్రస్తుత అడ్మిషన్ల ప్రక్రియపై సమగ్రంగా మాట్లాడి పలు విలువైన సూచనలు చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జాన్ మిల్టన్ ఈ సందర్భంగా విద్యార్థుల విద్యా ప్రగతిని వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందం, అధ్యాపకేతర సిబ్బంది మరియు విద్యార్థినీ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ముత్తారం గ్రామంలో ముమ్మరంగా మలేరియా–టీబీ సర్వే..

- **ఇంటింటా మలేరియా పరీక్షలు.. 72 మందికి టీబీ ఎక్స్‌రే స్క్రీనింగ్..**

**ఆగస్టు 11:డిడి9 వార్త వెంకటాపురం.**

జిల్లా వైద్యాధికారి డాక్టర్ గోపాలరావు, టీబీ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ రవితేజ ఆదేశాల మేరకు, వెంకటాపురం మండలం, అలుబాక గ్రామపంచాయతీ పరిధిలోని ముత్తారం గ్రామంలో మంగళవారం విస్తృత వైద్య ఆరోగ్య కార్యక్రమాలు నిర్వహించారు.

గ్రామ సర్పంచ్ పూజారి ఆదిలక్ష్మి సమక్షంలో వైద్య సిబ్బంది ఇంటింటా మలేరియా సర్వే చేపట్టి రక్తపూత నమూనాలు సేకరించారు. అలాగే RDT ద్వారా మలేరియా నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. గ్రామంలో డ్రై డే కార్యక్రమాన్ని చేపట్టి, పరిసరాల్లో నిల్వ ఉన్న నీటిని తొలగించడం, పరిసరాల పరిశుభ్రత పాటించడం, సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండటం వంటి అంశాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కాచి చల్లార్చిన లేదా శుద్ధి చేసిన నీటిని మాత్రమే తాగాలని వైద్య సిబ్బంది సూచించారు.



**టీబీపై ప్రత్యేక అవగాహన–స్క్రీనింగ్..**

ముత్తారం గ్రామంలో జాతీయ క్షయ వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక టీబీ స్క్రీనింగ్, ఆరోగ్య శిబిరం నిర్వహించారు. రాత్రిపూట జ్వరం, రెండు వారాలకు మించి దగ్గు, కఫంలో రక్తం పడటం, బరువు తగ్గడం, రాత్రిపూట చెమటలు పట్టడం, ఆకలి మందగించడం వంటి లక్షణాలు ఉన్నవారిని గుర్తించి ఎక్స్‌రే స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరంలో 62 మందికి హెల్త్ చెకప్, 72 మందికి ఎక్స్‌రే స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. అనుమానిత లక్షణాలు ఉన్నవారిని గుర్తించి తదుపరి వైద్య పరీక్షలు, చికిత్సకు అవసరమైన సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పూజారి ఆదిలక్ష్మి, HEO కోటిరెడ్డి, STS వెంకటేశ్వరరావు, ANMs ధనలక్ష్మి, వెంకటరమణ, హెల్త్ అసిస్టెంట్లు మోహన్ కృష్ణ, చిన్న వెంకటేష్, టీబీ అలర్ట్ ఇండియా కోఆర్డినేటర్ రాజు, ఎక్స్‌రే టెక్నీషియన్ సంతోష్, కమ్యూనిటీ మొబిలైజర్ విజయ్ కుమార్, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా గ్రామస్థులు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు, సీజనల్ వ్యాధుల లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యులను సంప్రదించాలని అధికారులు సూచించారు.

# విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్ ముట్టడి:

**ఎస్ఎఫ్ఐ పిలుపు**

**భద్రాచలం , ఆగస్టు 11 డిడి9 వార్త**

పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరుతూ, ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజులు మరియు పుస్తకాల దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 13వ తేదీన తలపెట్టిన కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు కొప్పుల రవీందర్ విద్యార్థులకు పిలుపునిచ్చారు. మంగళవారం భద్రాచలంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులకు అందాల్సిన రూ.10,840 కోట్ల




స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెండింగ్‌లో ఉండటం వల్ల పేద, మధ్యతరగతి విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. నిధులు సకాలంలో విడుదల కాక పోవడంతో విద్యార్థుల చదువులు అర్ధాంతరంగా ఆగిపోయే పరిస్థితి నెలకొందన్నారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు నిబంధనలకు విరుద్ధంగా ఇష్టానుసారంగా ఫీజులు వసూలు చేస్తూ తల్లిదండ్రుల నడ్డివిరుస్తున్నాయని మండిపడ్డారు. అదేవిధంగా, పాఠశాలలు మరియు కళాశాలల యాజమాన్యాలు నిర్దిష్ట దుకాణాల్లోనే పుస్తకాలు, నోట్‌బుక్స్ కొనుగోలు చేయాలంటూ విద్యార్థులపై ఒత్తిడి తెస్తూ దోపిడీకి పాల్పడుతున్నాయని ఆరోపించారు. ఫీజు బకాయిల పేరుతో కళాశాలల యాజమాన్యాలు విద్యార్థుల ఒరిజినల్ సర్టిఫికెట్లను నిలిపివేయడం సరికాదని, సర్టిఫికెట్లు వెంటనే ఇప్పించేలా ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసమే ఈ నెల 13న నిర్వహిస్తున్న కలెక్టరేట్ ముట్టడికి జిల్లాలోని విద్యార్థులు, యువకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు కిరణ్, పవన్ కుమార్, నరేష్, భార్గవ్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సేవను జీవిత లక్ష్యంగా ఎంచుకున్న మన సీతక్క

**సమ్మక్క తల్లి ఒడిలో సీతమ్మ తల్లి**

**తాడ్వాయి డిడి9 వార్త**

తాడ్వాయి మండలం మేడారం సమ్మక్క తల్లి స్ఫూర్తిని గుండెల్లో నింపుకుని, ప్రజల సంక్షేమమే పరమావధిగా నిరంతరం ప్రజల కోసం పోరాడే ప్రజా నాయకురాలు మన సీతక్క అమ్మతనంలోని ఆప్యాయత, ఆపదలో ఆత్మీయ అండగా నిలిచే దాతృత్వ హృదయం, ప్రజల మనసుల్లో చెరగని ముద్ర వేసుకున్న మానవతామూర్తి మన సీతక్క అన్యాయాన్ని ఎదిరించే అపారమైన తెగువలో సమ్మక్క తల్లి వారసత్వాన్ని, ప్రజలకు నిస్వార్థంగా సేవ చేయడంలో



సారలమ్మ తల్లి సేవా స్ఫూర్తిని పునికి పుచ్చుకున్న ధీశాలి మన సీతక్క ప్రజల కన్నీటిని తన కన్నీటిగా భావించి, ప్రజల కష్టసుఖాల్లో వెన్నంటి నిలిచి, అణగారిన వర్గాల ఆశలకు అండగా, ఆపన్నుల జీవితాలకు వెలుగుగా నిలిచే నిండు పున్నమి మన సీతక్క సమ్మక్క, సారలమ్మ తల్లుల పోరాట స్ఫూర్తికి ప్రతిరూపంగా, ప్రజాసేవను జీవిత లక్ష్యంగా ఎంచుకున్న మన సీతక్క ప్రజల గుండెల్లో ఎప్పటికీ నిలిచే, ప్రజలు అనునిత్యం కొలిచే ఆత్మీయ నాయకురాలు గొంది సరిత కాంగ్రెస్ పార్టీ తాడ్వాయి మండల మహిళా అధ్యక్షురాలు పాల్గొన్నారు.

# భారతి నగర్ డివిజన్ అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి..

- **జోనల్ కమిషనర్‌ను కలిసిన మాజీ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి**

**రామచంద్రాపురం, ఆగస్టు 11 (సిరి న్యూస్)**

భారతి నగర్ డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను వేగవంతం చేసి, ప్రజా సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మాజీ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ నారాయణ అమిత్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. బొంబాయి కాలనీ కమ్యూనిటీ హాల్ అద్దెను సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండేలా రూ.8 వేలకు నిర్ణయించాలని కోరారు. దీనిపై జోనల్ కమిషనర్ సానుకూలంగా స్పందించి, రూ.8 వేల అద్దె నిర్ణయాన్ని ఆమోదిస్తూ తదుపరి చర్యల కోసం డిప్యూటీ కమిషనర్ ప్రదీప్‌కు పంపించారు. తన కార్పొరేటర్ పదవీ కాలంలో మంజూరైన ఎల్ఐజీ కాలనీ హౌస్ నంబర్ 511 సమీపంలోని షెడ్, ఫెన్సింగ్ ఏరియా షెడ్, ఎంఏసీ సొసైటీ కమ్యూనిటీ హాల్ షెడ్ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సింధు ఆదర్శ్ రెడ్డి కోరారు. ఎంఎంటీఎస్ నుంచి అన్నమయ్య ఎన్‌క్లేవ్ వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి అవసరమైన బడ్జెట్ కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే ఓల్డ్ ఎంఐజీలో కమ్యూనిటీ హాల్ పెండింగ్ పనులను పూర్తి చేయాలని, బొంబాయి కాలనీలో నిర్మించిన మోడల్ రైతు బజార్‌ను వెంటనే ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. సమస్యలను సానుకూలంగా పరిశీలించిన జోనల్ కమిషనర్ నారాయణ అమిత్ సంబంధిత అధికారులతో సమన్వయం చేసి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ ప్రదీప్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ విద్యకు దీటుగా ప్రభుత్వ విద్యను అభివృద్ధి చేయాలి

- **పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో ఎం.పి.పి.ఎస్. పాఠశాలకు వాటర్ క్యాన్ల వితరణ**

**గుండాల, ఆగస్టు 11 (డి డి 9 వార్త) :**

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని పూర్వ విద్యార్థులు పిలుపునిచ్చారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ విద్యా వ్యవస్థను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని వారు పేర్కొన్నారు. గుండాల మండలంలోని ఎం.పి.పి.ఎస్. పాఠశాలలో 1998–99 విద్యా సంవత్సరానికి చెందిన పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థుల కోసం వాటర్ క్యాన్లను వితరణ చేశారు. పాఠశాలలో విద్యార్థులకు తాగునీటి సౌకర్యాన్ని మరింత మెరుగుపరచాలనే ఉద్దేశంతో ఈ



కార్యక్రమాన్ని చేపట్టినట్లు పూర్వ విద్యార్థులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు గ్రామీణ, పేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లలకు విద్యను అందించడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్న పూర్వ విద్యార్థులు తాము చదువుకున్న పాఠశాలల అభివృద్ధికి తమ వంతు సహకారం అందించడం అభినందనీయమన్నారు. విద్యార్థులకు తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్, ఫర్నిచర్, డిజిటల్ విద్యా సదుపాయాలు వంటి మౌలిక వసతులు అందుబాటులో ఉంటే ప్రభుత్వ పాఠశాలలపై విద్యార్థులు, తల్లిదండ్రుల్లో మరింత నమ్మకం పెరుగుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వ విద్యను బలోపేతం చేయడం ఒక్క ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, పూర్వ విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు కూడా భాగస్వాములు కావాలని కోరారు. తాము చదువుకున్న పాఠశాలకు తమ వంతుగా వాటర్ క్యాన్లను అందించడం ద్వారా విద్యార్థుల అవసరాన్ని తీర్చడంతో పాటు ఇతర పూర్వ విద్యార్థులకు కూడా ఆదర్శంగా నిలవాలని భావించినట్లు తెలిపారు. పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు దాతలు, పూర్వ విద్యార్థులు ముందుకు రావాలని, విద్యార్థుల భవిష్యత్తు కోసం సమాజంలోని ప్రతి ఒక్కరూ సహకరించాలని వారు కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించడంతో పాటు సౌకర్యాలను మెరుగుపరిస్తే ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ విద్యా సంస్థలు అభివృద్ధి చెందుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి. రమేష్, ఉపాధ్యాయులు శరత్ బాబు, ప్రమీల, వెన్నెల, శకుంతల, పూర్వ విద్యార్థులు అబ్దుల్ ఖైసర్, గుండెబోయిన లక్ష్మీనారాయణ, వాంకుడోతు జగన్, సనప శ్రీనివాసరావు, మొక్క శంకర్, మొక్క సంతోష్, నవతెలంగాణ విలేఖరి తవిడిశెట్టి రాంబాబు, బీజేపీ మండల అధ్యక్షుడు సోలం సతీష్, పాఠశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ శ్రేణులు ఐక్యంగా పనిచేయాలి




**జనగామ, ఆగస్టు 11 (డీడీ 9 వార్త): బ్యూరో**

స్టేషన్ ఘన్‌పూర్‌లో విస్తృత స్థాయి సమావేశం.. ఎమ్మెల్యే కడియం శ్రీహరి రఘునాథపల్లి మండలం నీడిగొండలోని సత్యసాయి కన్వెన్షన్‌లో స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే, మాజీ ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి ముఖ్య అతిథిగా పాల్గొని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. SIR కార్యక్రమంలో నియోజకవర్గం రాష్ట్రంలో మూడో స్థానం, ఉమ్మడి జిల్లాలో మొదటి స్థానంలో నిలవడం అభినందనీయమన్నారు. రెండో విడతలో రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచేలా కృషి చేయాలని సూచించారు. నియోజకవర్గంలోని 291 బూత్‌లకు ఒక్కో బూత్‌కు 10 చొప్పున ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని తెలిపారు. గుడిసెల్లో నివసిస్తున్న అర్హులను గుర్తించి పది రోజుల్లో లబ్ధిదారుల జాబితాలు అందజేయాలని సూచించారు. ఆగస్టు 15 నుంచి డిజిటల్ రేషన్ కార్డుల పంపిణీ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధికి రూ.400 కోట్లు, వివిధ అభివృద్ధి పనులకు సుమారు రూ.1,600 కోట్లతో పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు వ్యక్తిగత విభేదాలను పక్కనపెట్టి ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ శంకర్ నాయక్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు లకావత్ ధన్వంతి, లింగాల జగదీష్ రెడ్డి లింగాల వంశీ రెడ్డి తదితర ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# తాడ్వాయి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులకు , కార్యకర్తలకు నమస్కారం

- **రాష్ట్ర మంత్రీ వర్యులు సీతక్క ఆదేశాల మేరకు.**
- **ఆగస్టు 16 , ఆదివారం రోజున మేడారం విచ్చేస్తున్న సీఎం రేవంత్ రెడ్డి పర్యటనను విజయవంతం చేయాలి**

**తాడ్వాయి డిడి9 వార్త**



తేదీ:12.08.2026 బుధవారం ఉదయం 10:00 గంటలకు

తాడ్వాయి మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మంకిడి నరసింహ స్వామి ఆద్వర్యంలో జరిగే అత్యవసర సమావేశానికి ముఖ్య అతిథులుగా విచ్చేస్తున్న ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పైడాకుల అశోక్ మండల ఇంచార్జీ జగన్మోహన్ రెడ్డి

కావున జిల్లా నాయకులు , సీనియర్ నాయకులు , మండల నాయకులు , సహకార సంఘం చైర్మన్, మాజీ చైర్మన్ లు , సింగిల్ విండో డైరెక్టర్ లు , సర్పంచులు , ఉపసర్పంచులు , మాజీ సర్పంచులు , మాజీ ఎంపీటీసీలు , అనుబంధ సంఘాల నాయకులు , గ్రామ కమిటీ అధ్యక్షులు , యూత్ కాంగ్రెస్ నాయకులు , మహిళా నాయకురాలు , ప్రతీ ఒక్కరూ అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరుతూన్నాను .

# పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి అండ

**రూ.71 వేల విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ**



**గుండాల, ఆగస్టు 11 (డిడి 9 వార్త):**

ఆర్థిక ఇబ్బందులతో వైద్య చికిత్స పొందుతున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి ఎస్కే ఖదీర్ అన్నారు. పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు గుండాల మండల కేంద్రంలో మంగళవారం ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి ఎస్కే ఖదీర్ ఆధ్వర్యంలో లబ్ధిదారులు వజ్జ ఎర్రయ్య, వాంకుడోత్ అంబికా కుటుంబాలకు మొత్తం రూ.71,000 విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్కే ఖదీర్ మాట్లాడుతూ.. అనారోగ్యంతో వైద్య చికిత్స పొందుతున్న పేద కుటుంబాలకు వైద్య ఖర్చులు భారంగా మారుతున్న పరిస్థితుల్లో ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా అందుతున్న ఆర్థిక సహాయం ఎంతో ఊరటనిస్తోందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. ముఖ్యమంత్రి సహాయనిధి, ఎల్ఓసీల ద్వారా అర్హులైన వారికి అవసరమైన ఆర్థిక సహాయం అందేలా పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు నిరంతరం కృషి చేస్తున్నారని ఎస్కే ఖదీర్ పేర్కొన్నారు. ప్రజలకు ఏ సమస్య వచ్చినా ఎమ్మెల్యే దృష్టికి తీసుకువస్తే, ప్రభుత్వ పరంగా సాధ్యమైనంత మేరకు పరిష్కరించేందుకు పాయం వెంకటేశ్వర్లు అహర్నిశలు కృషి చేస్తున్నారని అన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు అండగా నిలుస్తూ వైద్య చికిత్సకు ఆర్థిక సహాయం అందేలా కృషి చేస్తున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుకు గుండాల మండల ప్రజల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గుండాల మండల అధ్యక్షులు ఊకే బుచ్చయ్య, మండల నాయకులు వాంకుడోత్ బీకోజీ, బూక్య శ్రీను, గుండాల గ్రామపంచాయతీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వాంకుడోత్ రమేష్, యువజన నాయకులు ఎస్కే ఇస్రార్, గడ్డం రాజేష్, సనప రాంబాబు, పల్లపు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## కార్యకర్తల కోసమే పార్టీ మారాను..

- రాజకీయ వ్యభిచారం చేయలేదు!
- మంజీరా ఒడ్డున పోచారం శ్రీనివాస్ రెడ్డి ఘాటు వ్యాఖ్యలు..
- చెక్ డ్యామ్ తో రైతులకు జల భరోసా



**కామారెడ్డి జిల్లా బ్యూరో, ఆగస్టు 11(డిడి9 వార్త):**

కామారెడ్డి జిల్లా బీర్కూర్ మండల శివారులో మంజీరా నదిపై చెక్‌డ్యామ్ నిర్మాణం పూర్తయిన నేపథ్యంలో రాజకీయ వేడి కూడా రాజుకుంది. చెక్‌డ్యామ్ వద్ద నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి తన రాజకీయ ప్రస్థానం, పార్టీ మార్పుపై ఘాటు వ్యాఖ్యలు చేశారు.కార్యకర్తల కోసమే పార్టీ మారాను.. రాజకీయ వ్యభిచారం చేయలేదు అంటూ ప్రత్యర్థుల విమర్శలకు తనదైన శైలిలో సమాధానం ఇచ్చారు.మంజీరా నది ఒడ్డున నిర్వహించిన ఈ ఆత్మీయ సమావేశానికి రైతులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.చెక్‌డ్యామ్ నిర్మాణం పూర్తికావడం వల్ల ఈ ప్రాంత రైతాంగానికి కలిగే ప్రయోజనాలను వివరించడంతో పాటు తన రాజకీయ నిర్ణయాలపై కూడా పోచారం స్పష్టత ఇచ్చారు.

**రాజకీయ నిర్ణయం.. కార్యకర్తల కోసమే**

పార్టీ మార్పుపై వస్తున్న విమర్శలను ప్రస్తావిస్తూ పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఘాటుగా స్పందించారు.తన రాజకీయ నిర్ణయం వ్యక్తిగత ప్రయోజనాల కోసం కాదని, కార్యకర్తల భవిష్యత్తు, వారి ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకునే తీసుకున్నానని స్పష్టం చేశారు.తాను రాజకీయ వ్యభిచారం చేయలేదని పేర్కొంటూ ప్రత్యర్థులకు గట్టి కౌంటర్ ఇచ్చారు.కార్యకర్తల కోసం పార్టీ మారాను.. జాతీయ జెండా కండువా కప్పుకున్నాను అంటూ తన రాజకీయ వైఖరిని వివరించారు.దీంతో సమావేశంలో రాజకీయ చర్చకు దారితీసేలా ఆయన వ్యాఖ్యలు నిలిచాయి.

**రైతు తలెత్తుకుని జీవిస్తేనే సమాజం అభివృద్ధి చెందుతుంది**

రైతు బాగుంటేనే సమాజం బాగుంటుందని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. రైతు ఆర్థికంగా బలపడినప్పుడే గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి సాధ్యమవుతుందని, రైతుల సంక్షేమం కోసం సాగునీటి వసతుల విస్తరణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.సాగునీరు అందుబాటులో ఉంటే రైతు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతారని, రైతు కన్నీరు తుడవడమే నిజమైన అభివృద్ధికి కొలమానం అని పోచారం పేర్కొన్నారు.రైతాంగానికి శాశ్వత ప్రయోజనం చేకూర్చే సాగునీటి ప్రాజెక్టులు, చెక్‌డ్యామ్‌లు, నీటి నిల్వ సామర్థ్యం పెంపు వంటి పనులకు నిరంతరం కృషి చేస్తామని స్పష్టం చేశారు. మంజీరా జలాలను సద్వినియోగం చేసుకుని బీర్కూర్ ప్రాంతాన్ని మరింత సస్యశ్యామలంగా మార్చేందుకు అవసరమైన చర్యలు చేపడతామని ఆయన అన్నారు. రైతుల ప్రయోజనాలే కేంద్రంగా అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని పోచారం స్పష్టం చేశారు.

**రూ.32 కోట్లతో చెక్ డ్యామ్.. 3 కి.మీ. పరిధిలో జలమట్టం పెరిగే అవకాశం**

సుమారు రూ.32 కోట్ల వ్యయంతో నిర్మించిన చెక్‌డ్యామ్ వల్ల బీర్కూర్ మండలంలోని రైతులకు గణనీయమైన ప్రయోజనం కలుగుతుందని పోచారం తెలిపారు.చెక్‌డ్యామ్‌లో నీటి నిల్వలు పెరగడంతో పరిసర ప్రాంతాల్లో సుమారు 3 కిలోమీటర్ల పరిధి వరకు భూగర్భ జలమట్టం పెరిగే అవకాశం ఉందని చెప్పారు.భూగర్భ జలాలు సమృద్ధిగా లభిస్తే బోర్లు, బావుల్లో నీటి లభ్యత పెరిగి సాగునీటి సమస్యలు కొంతమేర తగ్గుతాయని పేర్కొన్నారు. మంజీరాలో నీటి నిల్వలు పెరగడం వల్ల భవిష్యత్‌లో బీర్కూర్ మండలంలో సాగు విస్తీర్ణాన్ని మరింత పెంచుకునే అవకాశం ఉందన్నారు.

**మంజీరా జలాలతో బీర్కూర్ కు కొత్త ఆశలు**

చెక్‌డ్యామ్ నిర్మాణం పూర్తికావడంతో రైతుల్లో ఆనందం నెలకొందని, నీటి వనరుల అభివృద్ధితో ఈ ప్రాంత వ్యవసాయానికి మరింత ఊతం లభిస్తుందని పోచారం పేర్కొన్నారు.నీటిని నిల్వ చేసుకోవడం ద్వారా భూగర్భ జలాలను పెంచి రైతులకు శాశ్వత ప్రయోజనం కల్పించాలన్నదే లక్ష్యమని తెలిపారు.

ఒకవైపు మంజీరా జలాలతో రైతాంగానికి భరోసా కల్పించే ప్రాజెక్టు పూర్తయిన సందర్భంగా ఆత్మీయ సమావేశం జరగగా.. మరోవైపు పోచారం చేసిన రాజకీయ వ్యాఖ్యలు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి.పార్టీ మార్పుపై తనపై వచ్చిన విమర్శలకు ఆయన చేసిన ఘాటు వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తించాయి.ఈ కార్యక్రమంలో బీర్కూర్ ఏఎంసీ చైర్మన్ శామల, యువనాయకులు మియాపురం శశికాంత్, ఉపసర్పంచ్ పరమేష్, పెర్క శ్రీనివాస్, సర్పంచులు అప్పారావ్, దేవీసింగ్, మాజీ ఎంపీపీ గాండ్ల రఘు, కొరిమె రఘు, ఏఎంసీ డైరెక్టర్ గోండ్ల రాజు, ఆత్మకమిటీ డైరక్టర్ కుతాడి శంకర్,సందుల రవి, నాయకులు దుంపల రాజు, బస్వరాజ్ పటేల్, ప్రశాంత్ యాదవ్, అధికారులు తహసీల్దార్ సవాయి సింగ్, ఎస్సై వికె రాములు, సంబంధిత అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.



## ఆదివాసీలకు పౌష్టికాహారం, రక్షిత మంచినీరు అందించాలి

- కెరమెరి–జోడేఘాట్ డబుల్ రోడ్డును కొమరం భీమ్ వర్ధంతి నాటికి పూర్తి చేయాలి
- అడ, ఎన్టీఆర్ సాగర్ ప్రాజెక్టుల ఆయకట్టుకు పూర్తిస్థాయిలో సాగునీరు ఇవ్వాలి
- తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత



హైదరాబాద్,అగస్టు 11,(డిడి9 వార్త): రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో నివసిస్తున్న ఆదివాసీలకు పౌష్టికాహారం, రక్షిత తాగునీరు అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. మంగళవారం బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాకు చెందిన పలువురు ఆదివాసీ నాయకులు, తెలంగాణ ఆదివాసీ టైగర్ సేన నాయకులు తెలంగాణ రక్షణ సేనలో చేరారు. వారికి కవిత కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆదివాసీల ఆరాధ్య దైవం కొమరం భీమ్ వర్ధంతి నాటికి కెరమెరి నుంచి జోడేఘాట్ వరకు డబుల్ రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. అడ ప్రాజెక్టు, ఎన్టీఆర్ సాగర్ ప్రాజెక్టుల కాల్వలను ఆధునీకరించి సుమారు 60 వేల ఎకరాల ఆయకట్టుకు పూర్తిస్థాయిలో సాగునీరు అందించేలా చర్యలు చేపట్టాలన్నారు. పోడు భూముల సమస్యను పరిష్కరించడంతో పాటు, గతంలో ప్రభుత్వం మంజూరు చేసిన హక్కుల పత్రాలకు సంబంధించిన భూములను వెంటనే ఆదివాసీలకు అప్పగించాలని కోరారు. ఇందుకోసం అటవీ, రెవెన్యూ శాఖల అధికారులతో సంయుక్త సర్వే నిర్వహించాలని సూచించారు. ఆదివాసీల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన ఐటీడీఏలు నామమాత్రంగా మారడం దురదృష్టకరమని కవిత అన్నారు. ఆదివాసీ నాయకుడు సోయం బోజారావు గుట్టబండపై మట్టి పోసి పంటలు సాగు చేయడం వారి దుర్భర పరిస్థితులకు అద్దం పడుతోందన్నారు. త్వరలోనే ఆదివాసీ ప్రాంతాల్లో పర్యటించి వారి సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుంటామని, ఆదివాసీలకు ఎల్లవేళలా అండగా ఉంటామని కవిత హామీ ఇచ్చారు. కోట్నక కిషన్‌రావు, పెందోర్ ధర్మ, పెందోర్ దౌలత్‌రావు తదితరులు తెలంగాణ రక్షణ సేనలో చేరారు. కార్యక్రమంలో మాజీ మంత్రి బోడ జనార్దన్, సిర్పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కావేటి సబిత తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ ఆస్పత్రుల నర్సులకు హెల్త్ ఇన్సూరెన్స్ కల్పించాలి

- నర్సుల హక్కులపై ప్రభుత్వం ప్రైవేట్ ఆస్పత్రులతో చర్చించాలి
- పనివేళలు, జీతాలు, ఓవర్‌టైమ్‌పై నర్సులను ఇబ్బంది పెట్టొద్దు
- తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత



**హైదరాబాద్,ఆగస్ట్ 11,(డిడి9 వార్త):**

ప్రైవేట్ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న నర్సులకు హెల్త్ ఇన్సూరెన్స్ లేకపోవడం బాధాకరమని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత ఆవేదన వ్యక్తం చేశారు. నర్సులు, ప్రైవేట్ ఆస్పత్రుల సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వం తక్షణమే దృష్టి సారించాలని ఆమె డిమాండ్ చేశారు. మంగళవారం బంజారాహిల్స్‌లోని తెలంగాణ రక్షణ సేన కార్యాలయంలో ప్రైవేట్ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న పలువురు నర్సులు కవితను కలిసి తమ సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా వారి సమస్యలను అడిగి తెలుసుకున్న కవిత.. ప్రైవేట్ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న సిబ్బందికి కనీస భద్రత, ఆరోగ్య రక్షణ కల్పించాల్సిన బాధ్యత యాజమాన్యాలపై ఉందన్నారు. ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాలు పెద్ద ఎత్తున ప్రజల నుంచి వైద్య ఖర్చుల రూపంలో డబ్బులు వసూలు చేస్తున్నప్పటికీ, అక్కడ పనిచేసే నర్సులు, ఇతర సిబ్బందికి మాత్రం అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆమె అన్నారు. కనీసం హెల్త్ ఇన్సూరెన్స్ సదుపాయం కూడా లేకపోవడం సరికాదని పేర్కొన్నారు. ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాలతో ప్రభుత్వం వెంటనే చర్చలు జరిపి, అక్కడ పనిచేసే నర్సులు, సిబ్బందికి హెల్త్ ఇన్సూరెన్స్ కల్పించేలా చర్యలు తీసుకోవాలని కవిత డిమాండ్ చేశారు. అదేవిధంగా పనివేళలు, జీతాలు, ఓవర్‌టైమ్ వంటి అంశాల్లో కూడా నర్సులు, ఉద్యోగులను ఇబ్బందులకు గురిచేయకుండా ప్రభుత్వం స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేయాలని కోరారు. తెలంగాణకు చెందిన ఉద్యోగుల విషయంలో వివక్ష చూపుతూ, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే వారికి ప్రాధాన్యం ఇస్తున్నారనే ఆరోపణలపై కూడా ప్రభుత్వం దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న నర్సులు, సిబ్బంది హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని కవిత కోరారు. వారి సమస్యల పరిష్కారానికి తెలంగాణ రక్షణ సేన అండగా ఉంటుందని ఆమె హామీ ఇచ్చారు.

## రైతుల డీఏపీ కష్టాలకు పరిష్కారం

- టోకెన్లు జారీ చేసి ఎరువుల పంపిణీకి చర్యలు
- రైతుల సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లిన ఆడే జైపాల్
- అధికారుల స్పందనతో డీఏపీ కోసం రైతుల ఎదురుచూపులకు తెర

డిడి9 వార్త గుడిహత్నూర్: మండల కేంద్రంలోని హక్కా ఫార్మర్ కేంద్రంలో డీఏపీ ఎరువులు అందుబాటులో ఉన్నప్పటికీ టోకెన్లు జారీ కాకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రైతుల సమస్యను సామాజిక కార్యకర్త, కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు ఆడే జైపాల్ వెంటనే జిల్లా కలెక్టర్ రాజర్షి షా, డీసీసీ అధ్యక్షుడు డా. జాదవ్ నరేష్ దృష్టికి తీసుకెళ్లారు.రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించి, వెంటనే టోకెన్లు జారీ చేసి డీఏపీ ఎరువులు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన అధికారులు సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టి రైతులకు డీఏపీ ఎరువులు అందేలా చూశారు.ఎరువులు అందడంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు. తమ సమస్యను పరిష్కరించేందుకు స్పందించిన జిల్లా కలెక్టర్ రాజర్షి షా, డీసీసీ అధ్యక్షుడు డా. జాదవ్ నరేష్‌కు, అలాగే రైతుల ఇబ్బందిని తన సమస్యగా భావించి అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం చొరవ చూపిన ఆడే జైపాల్‌కు రైతులు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.



## పటాన్ చెరు ప్రభుత్వ ఆసుపత్రి కరెంటు కష్టాలపై ఎమ్మెల్యే జిఎంఆర్ సీరియస్

- విద్యుత్ సమస్యపై అధికారుల తీరుపై ఆగ్రహం
- జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లిన ఎమ్మెల్యే.
- తక్షణమే 4 లక్షల రూపాయల నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి..
- నిధులు విడుదలైన వెంటనే వైరింగ్ పనులు పూర్తి చేయాలని ఆదేశం..
- త్వరలో ఆసుపత్రి అభివృద్ధి సలహా కమిటీ సమావేశం

**పటాన్ చెరు, ఆగస్టు 11, :**



స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో విద్యుత్ సమస్యలు తలెత్తి రోగులు ఇబ్బందులు పడుతున్న ఘటనపై పటాన్ చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి (జిఎంఆర్) తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే పేద, మధ్యతరగతి ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని వసతులను అందుబాటులో ఉంచాల్సిన బాధ్యత అధికారులపై ఉందని స్పష్టం చేశారు. మంగళవారం ఉదయం తన క్యాంపు కార్యాలయంలో ఆసుపత్రి ఆర్ఎంఓ శ్రీనివాస్, వైద్యులు, ఆసుపత్రి అభివృద్ధి సలహా సంఘం సభ్యులతో ఎమ్మెల్యే జిఎంఆర్ ప్రత్యేకంగా సమీక్ష సమావేశం నిర్వహించారు. సోమవారం ఆసుపత్రిలో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో పాటు జనరేటర్ పనిచేయకపోవడం వల్ల రోగులు, వారి సహాయకులు ఎదుర్కొన్న ఇబ్బందులపై ఆయన అధికారులను ఆరా తీశారు. ఆసుపత్రిలో విద్యుత్ సమస్య తలెత్తినా, జనరేటర్ పనిచేయక పోయినా ఈ విషయం నా దృష్టికి ఎందుకు తీసుకురాలేదు?" అంటూ అధికారులను ఎమ్మెల్యే ప్రశ్నించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో అత్యవసర వైద్య సేవలు అందించే సమయంలో విద్యుత్ అంతరాయం ఏర్పడటం, ప్రత్యామ్నాయంగా ఉండాల్సిన జనరేటర్ కూడా పనిచేయకపోవడం ఏమాత్రం సమర్థనీయం కాదని ఆయన స్పష్టం చేశారు. ఆసుపత్రి మొత్తం విద్యుత్ వైరింగ్‌ను మార్చేందుకు సుమారు రూ.4 లక్షలు అవసరమవుతాయని అధికారులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే జిఎంఆర్.. జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌కు ఫోన్ చేసి ఆసుపత్రి వైరింగ్ పనుల కోసం అవసరమైన నిధులను తక్షణమే మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. సమస్య తీవ్రతను దృష్టిలో ఉంచుకుని వెంటనే నిధులు మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు. నిధులు మంజూరైన వెంటనే పనులను ప్రారంభించి, ఆసుపత్రిలో విద్యుత్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి. ఇకపై ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. కరోనా మహమ్మారి సమయంలో సీఎస్ఆర్ నిధులతో ఆసుపత్రికి జనరేటర్ ఏర్పాటు చేసిన విషయాన్ని ఈ సందర్భంగా ఎమ్మెల్యే గుర్తు చేశారు. అత్యవసర సమయాల్లో రోగులకు నిరంతరాయంగా వైద్య సేవలు అందించేందుకు జనరేటర్‌ను పూర్తి స్థాయిలో అందుబాటులో ఉంచాలని సూచించారు. అదే విధంగా పటాన్ చెరు ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధికి సంబంధించి చేపట్టాల్సిన పనులు, అందుబాటులో ఉన్న వైద్య సదుపాయాలు, రోగులకు కల్పించాల్సిన మౌలిక వసతులపై చర్చించేందుకు త్వరలోనే ఆసుపత్రి అభివృద్ధి సలహా కమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే ప్రతి ఒక్కరికీ మెరుగైన వైద్యం, నాణ్యమైన మౌలిక వసతులు అందేలా చర్యలు తీసుకోవడమే తమ ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ప్రజల ఆరోగ్యానికి సంబంధించిన అంశాల్లో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించేది లేదని, సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే తక్షణమే పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఆయన తెలిపారు.

The imprint line should be printed legibly as Printed by Published by BATHULA KUMARA RAJA on behalf of GARUDA, printes at and published at H.No 2-86/1 PLOT NO. 26-SP, SY NO 420 sager highway, ragannaguda village, abdullapur mandal RANGAREDDY , TELANGANA- 502518